ప్రజాశక్తి

శుక్రవారం 2 ఫిబ్రవరి 2024 8 పేజీలు

గుంటూరు పల్నాడు





కేంద్ర బడ్జెట్‌పై పెదవివిరుపులు



అమరావతి ఊసెత్తని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఓన్ ఆన్ ఎకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఈ బడ్జెట్‌లో ఎప్పటిమాదిరిగానే రాష్ట్రానికి సంబంధించిన అనేక అంశాలు విస్మరించారన్న విమర్శలు వచ్చాయి. ప్రధానంగా రాజధాని అమరావతి ప్రస్తావన లేదు. ప్రపంచస్థాయి రాజధానిని నిర్మిస్తామని 2015 అక్టోబరు 22న ఉద్దండ్రాయునిపాలెంలో జరిగిన అమరావతి నిర్మాణం శంకుస్థాపన సందర్భంగా జరిగిన సభలో చెప్పిన ప్రధాని మోడీ గత 9 ఏళ్లలో ఎటువంటి నిధులు కేటాయించలేదు. కేవలం రూ.1500 కోట్లు ఇచ్చి కేంద్రం చేతులు దులుపుకొంది. ఈ సారి ఎన్‌డిఎ ప్రభుత్వంకు చివరి బడ్జెట్‌లో కూడా రాజదాని ప్రస్తావన రాలేదు. అలాగే విభజన చట్టం అమలుకు చర్యలు లేవు. రానున్న ఎన్నికల నేపథ్యంలో పలు తాయిలాలను ప్రకటిస్తూ కేంద్ర ఆర్థిక మంత్రి తన బడ్జెట్ ప్రసంగంలో పొందుపర్చారు. బడ్జెట్‌లో వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇచ్చినట్టు చెప్పినా పంటలకు గిట్టుబాటు ధర కల్పించేందుకు స్వామినాథన్ కమిషన్ చేసిన సిఫార్సుల అమలుపై ప్రస్తావించలేదని రైతు సంఘాల నాయకులు వాపోతున్నారు. లాంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం, మంగళగిరం ఎయిమ్స్ అభివృద్ధికి సంబంధించి కూడా కేటాయింపులు లేవు.

రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదు : మస్తాన్‌వలి

రాష్ట్రానికి ఆర్థిక మంత్రి ఒరగబెట్టిందేమీ లేదని పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్‌వలి పేర్కొన్నారు. పదేళ్ల మాదిరిగానే ఈ సారి కూడా రాష్ట్ర ప్రజల ఆశలను కేంద్రం నీరుగార్చింద న్నారు. ఎంతో మంది అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమానికి బడ్జెట్‌లో ప్రస్తావన లేదన్నారు. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న పిఎఫ్ ఖాతాదారుల పింఛన్ల పెంపుపై ప్రస్తావించలేదన్నారు. విభజన హామీల అమలు, ప్రత్యేక హోదాను పట్టించుకోలేదన్నారు.

అమరావతికి అన్యాయం చేశారు



పాశం రామారావు, సిపిఎంజిల్లా కార్యదర్శి

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందని సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు పేర్కొన్నారు. విభజన హామీలు, ప్రత్యేక హోదా, గిరిజన యూనివర్సిటీ, విశాఖ ఉక్కును కాపాడతామని బడ్జెట్‌లో ప్రస్తావించలేదన్నారు. వెనుకబడిన ప్రాంతాలకు నిధులు లేవన్నారు. 10 ఏళ్ల నుంచి రాష్ట్రానికి అన్యాయం జరుగుతుందని ఎన్‌డిఏ ప్రభుత్వం చివరి బడ్జెట్‌లో రాష్ట్రానికి కేటాయింపులు లేకపోవడం దారుణమన్నారు. బడ్జెట్‌ను సిపిఎం తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు.

ఎన్నికల తాయిలాలు



గుంటూరు విజయకుమార్ , సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి

బడ్జెట్‌లో తాయిలాలు ప్రకటించి ఎన్నికల్లో ఓట్లు రాబట్టుకునే ప్రయత్నం చేశారని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ అన్నారు. మధ్య తరగతి ప్రజలకు సోలార్ విద్యుత్ 300 యూనిట్ల వరకు ఉచితమని ప్రకటించడం వెనుక కార్పొరేట్ శక్తుల హస్తం ఉండవచ్చన్నారు. సోలార్ నిర్వహణ మొత్తం కార్పొరేట్ వ్యవస్థకు కట్టబెట్టే ప్రమాదం ఉందన్నారు. ప్రజలపై ఛార్జీల భారం మోపుతున్నారని అన్నారు. రామమందిరం ప్రస్తావన ద్వారా మతోన్మాద శక్తులకు కేంద్రమే ప్రోత్సహిస్తున్నట్టు ఉందన్నారు.



5 లో

ప్రజలతో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

పేదలకు అండగా పోరాడతాం

- రైల్వే స్థల నివాస బాధితులతో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు
- సమస్యపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని డిమాండ్

ఎన్నికల నిర్వహణ ఒక సవాల్

నూతన ఎస్‌పిగా బాధ్యతలు స్వీకరించిన తుషార్ దూడి

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి



గుంటూరు జిల్లా నూతన ఎస్‌పిగా తుషార్ దూడి గురువారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. పోలీసు గౌరవ వందనం స్వీకరించిన అనంతరం తన చాంబర్‌లోకి ప్రవేశించారు. కడప జిల్లా అడ్మిన్ అడిషనల్ ఎస్‌పిగా పనిచేస్తూ సాధారణ 2లో



సర్కిల్ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న ఐజి పాలరాజు, ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి : ఐజి

ప్రజాశక్తి - వినుకొండ

సమస్యాత్మక గ్రామాలను గుర్తించి అక్కడ పరిస్థితులను పర్యవేక్షించి, అక్కడ శాంతిభద్రతల పరిరక్షణకు తగిన ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను గుంటూరు రేంజ్ ఐజి బాలరాజు ఆదేశించారు. పల్నాడు జిల్లాలోని సమస్యాత్మక గ్రామాలకు సంబంధించి వినుకొండ పట్టణంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ ప్రాంగణంలో ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డితో కలిసి ఐజి గురువారం సమీక్షించారు. సమస్యాత్మకమైన వ్యక్తుల, రౌడీ షీటర్ల కదలికలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పోలీసు సిబ్బందితోపాటు 2లో

రూ.4.45 లక్షల ఎరువులు సీజ్

మిర్చి యార్డులో కొనసాగుతున్న రద్దీ

2 లో



నరసరావుపేటలో దీక్షలకు సంఘీభావంగా మాట్లాడుతున్న వి.కృష్ణయ్య



గుంటూరు దీక్షల్లో మాట్లాడుతున్న సీనియర్ నాయకులు వినోద

బకాయిలు చెల్లించకుంటే మూల్యం తప్పదు

- అప్పులు చేసి తెచ్చిన డబ్బులు ఎవరి జేబుల్లో వేసుకున్నారు
- రెండోరోజు కొనసాగిన యుటిఎఫ్ రిలేదీక్షలు
- పలు సంఘాల మద్దతు

ప్రజాశక్తి-గుంటూరు, పల్నాడు జిల్లా

ఉద్యోగులు, ఉపాధ్యాయులు జీతం నుండి పొదుపు చేసుకొని దాచుకున్న డబ్బును తిరిగి చెల్లించకుండా మొండిగా వ్యవహరిస్తున్న ఈ ప్రభుత్వం మూల్యం చెల్లించుకోక తప్పదని యుటిఫ్ నాయకులు హెచ్చరించారు. యుటిఎఫ్ ఆధ్వర్యంలో గుంటూరు కలెక్టరేట్ ఎదుట, పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని గాంధీ పార్కు వద్ద ధర్నాచౌక్‌లో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు రెండోరోజైన గురువారం కొనసాగాయి. గుంటూరులో దీక్షలను యుటిఎఫ్ నాయకులు టి.వినోద, కె.భావన్నారాయణ ప్రారంభించి మాట్లాడారు. ఉపాధ్యాయుల పట్ల ఇంత కక్షపూరితంగా వ్యవహరించిన ప్రభుత్వాన్ని గతంలో ఎన్నడూ చూడలేదన్నారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, ఎం.కళాధర్ మాట్లాడుతూ ప్రభుత్వ వరాల కోసం పోరాటం చేయట్లేదని, మేము దాచుకున్న డబ్బు మాకు ఇవ్వమని అడుగుతున్నామని చెప్పారు. 20వేల కోట్లు బకాయిలు చెల్లించకుండా ఈ ప్రభుత్వం ఉద్యోగులను ఆవేదనకు గురి చేస్తుందన్నారు. క్యాబినెట్ సమావేశంలో ప్రభుత్వం డిఎ, ఐఆర్ ప్రకటిస్తుందని భావించామని, కానీ ప్రభుత్వం మొండి చేయి చూపించిందన్నారు. ప్రభుత్వానికి రిటర్న్ గిఫ్ట్ తప్పకుండా ఉంటుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మొండి వైఖరి విడనాడి బకాయిలు చెల్లించాలని, ఐఆర్, డిఎ ప్రకటించి ఉద్యోగుల అభిమానం పొందాలని కోరారు. ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు జి.వెంకటేశ్వర్లు, 2లో

బకాయిలు చెల్లించకుంటే మూల్యం తప్పదు

(మొదటి పేజీ తరువాయి)

ఏఎల్.శివపార్వతి, కోశాధికారి ఎండి.దౌలా, ఆదినారాయణ, కె.సాంబశివరావు, జి.వెంకటేశ్వరరావు, యు.రాజశేఖర్‌రావు, కేదార్‌నాథ్, జి.వి.ధనలక్ష్మి, కె.ప్రేమ్‌కుమార్, ఎస్.బసవేశ్వరరావు పాల్గొన్నారు.

నరసరావుపేటలో రెండో రోజు దీక్షలను ఎన్జీవో నాయకుల రామకృష్ణ, ఆనంద్ ప్రారంభించారు. రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య సంఘీభావం తెలిపి మాట్లాడారు. నిబంధనలకు విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వ వ్యవహార శైలి ఉందని, బడ్జెట్లో కేటాయించిన నిధులను ఇతర పథకాలకు మళ్లించి రాష్ట్ర అభివృద్ధిని కూడా మరిచారని విమర్శించారు. గత 70 ఏళ్ల కాలంతో పోలిస్తే రూ .50 లక్షల కోట్లు అప్పులు ఉన్నాయని, మోడీ అధికారంలో ఉన్న పదేళ్ల కాలంలో రూ.1.10 లక్షల కోట్లు అప్పులు చేశారని, అప్పులు చేసిన డబ్బులు మొత్తం ఎవరి జేబులోకి వెళ్లాయో సమాధానం చెప్పాలని నిలదీశారు. ఉద్యోగ ఉపాధ్యాయులు బకాయిలు చెల్లించాలని కోరితే డబ్బులు లేవంటూ చెబుతున్నారని సమ్మెలను అణిచివేసేందుకు కుట్రలు పన్నుతున్నారని మండిపడ్డారు. మోడీ అధికారంలోకి వచ్చే ముందు విదేశాల్లో ఉన్న రూ 70 లక్షల కోట్లను వెనక్కు తెచ్చి పేదలకు పంచుతాని చెప్పిన డబ్బులు ఏమయ్యాయన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కలిసి రూ 10.5 లక్షల కోట్ల అప్పులు చేశారని, ఈ డబ్బులు కూడా ఏమయ్యాయో అర్థం కాని పరిస్థితి నెలకొందని అన్నారు. పిల్లలకు శ్రద్ధతో పాఠాలు చెప్పాల్సిన ఉపాధ్యాయులు తమ సమస్యల గురించి మానసిక వేదనతో గురవుతున్నారన్నారు. సరైన ఆదాయం సరైన పెన్షన్ పరిస్థితి లేకపోతే రానున్న రోజుల్లో ఉద్యోగ ఉపాధ్యాయుల పరిస్థితి దారుణంగా ఉంటుందని, ఉద్యోగ, ఉపాధ్యాయులకు భరోసా కల్పించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని గుర్తు చేశారు.

యుటిఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్షులు పి.ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ బకాయిలు చెల్లించాలని ఎన్నోసార్లు ప్రభుత్వానికి విన్నవించినా ప్రభుత్వ స్పందించలేదన్నారు. ఉపాధ్యాయులు తాము దాచుకున్న డబ్బులు కోసం కూడా పోరాటాలు చేసే పరిస్థితి ఏర్పడిందన్నారు. బకాయిలు మొత్తం విడుదల అయ్యే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. 12వ పిఆర్సీ, వేతన 30 శాతం మధ్యంతర భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గుంటూరు విజయకుమార్ మాట్లాడుతూ అన్ని రంగాల ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం తమ పాదయాత్రలో ఇచ్చిన హామీలను విస్మరించి మోసం చేసిందన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయులు దాచుకున్న డబ్బులు ఏమయ్యాయో సమాధానం చెప్పాలని, అవసరం అయితే దీనిపై శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దీక్షలో జిల్లా సహాధ్యక్షులు ఎం.మోహన్‌రావు, జిల్లా కోశాధికారి జె.వాల్యానాయక్, జిల్లా కార్యదర్శులు రవికుమార్, శ్రీనివాసరావు, ఆయేషా సుల్తానా, అజయ్ కుమార్, వెంకటేశ్వర్లు, అరుణ్ కుమార్, జిలాని, రాజ్ కుమార్, వివిధ మండల శాఖ బాధ్యులు ప్రసాద్, రామిరెడ్డి, గోవిందా నాయక్, తిరుపతిరెడ్డి, రమేష్ బాబు, మస్తాన్, భాను, గోవిందరాజు కూర్చున్నారు. నిరాహారదీక్షలో ఉన్న ఉపాధ్యాయులకు యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.విజయసారథి నిమ్మరసం అందజేసి దీక్షవిరమింప చేశారు. జిల్లా గౌరవా ధ్యక్షులు కె.శ్రీనివాసరెడ్డి, నాయకులు జి.ఆంజనే యులు, కౌలు రైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు కె.రామారావు, పల్నాడు విజ్ఞాన కేంద్రం కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి, శ్రామిక మహిళ సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ డి.శివకుమారి, జెవివి నాయకులు సుభాష్ చంద్రబోస్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు తొలగింపు

ప్రజాశక్తి - తాడికొండ : ప్రభుత్వ భూమి కాలీగా ఉంటే పాగా వేయాల్సిందే అన్నట్టు ఉంది తాడికొండ గ్రామంలో ఇలాంటి ఘటనే గురువారం తాడికొండ గ్రామంలో చోటుచేసుకుంది. అనుమతులు లేకుండా ఇల్లు నిర్మించేందుకు తాడికొండకు చెందిన ఓ వ్యక్తి సర్వే నెంబర్ 14 77 లో 20 సెంట్లు ప్రభుత్వ స్థలం ను ఇల్లు నిర్మించుకునేందుకు బోర్లు తీసి సిమెంట్ రాళ్లు పాతాడు విషయం తెలుసుకున్న వీఆర్వో మాల్యాద్రి అక్కడికెళ్లి పాతిన రాళ్లను తొలగించారు. ప్రభుత్వ స్థలంలో ఎవరైనా అనుమతులు లేకుండా ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మిర్చి యార్డులో కొనసాగుతున్న రద్దీ

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి

గుంటూరు మిర్చి యార్డులో రద్దీ కొనసాగుతోంది. పెద్ద సంఖ్యలో టిక్కిలు రావదం అంతా యార్డు ఆవరణం అంతా మిర్చి బస్తాలతో నిండిపోతోంది. వాహనాలు కూడా భారీగా రావడం వల్ల అటు గుంటూరు-చిలకలూరిపేట, ఇటు గుంటూరు-సత్తెనపల్లి మార్గంలో ట్రాఫిక్‌కు అంతరాయం కల్గుతోంది. అందువల్ల రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6గంటలలోపు మిర్చి వాహనాలన్నీ చేరాలని యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి గురువారం ఒక ప్రకటనలోకోరారు. పెద్ద సంఖ్యలో టిక్కిలు రావడం వల్ల యార్డు అంతా కిటకిటలాడుతోంది. గురువారం 1,24,034 టిక్కిలు వచ్చాయి. పాత నిల్వలతో కలిపి 1,20,528 టిక్కిలు అమ్ముడుపోయాయి. యార్డులో 79,912 టిక్కిలు ఇంకా నిల్వ ఉన్నాయి. సాధారణ రకాలు ధర క్వింటాలు కనిష్ట ధర రూ.8,500, గరిష్ట ధర రూ.20వేలు పలికింది. తేజ,బాడిగ రకాలు కనిష్ట ధర రూ.8వేలు, గరిష్టంగా రూ.21,500 ధర లభించింది. ప్రస్తుతం సరుకు నాణ్యత బాగుండటంతోఎక్కువ మంది ఏ రోజు కారోజు కొనుగోలు చేస్తున్నట్టు చెబుతున్నారు. కొంతమంది రైతుల నుంచి



వ్యాపారులు ఆంక్షలు విధిస్తున్నారు. తేమ శాతం ఎక్కువగా ఉందని, ఆరబెట్టుకుని తీసుకురమ్మని షరతువిధిస్తున్నారు. యార్డులోనే ఖాళీ స్థలాలలో ఆరబోసుకుని సాయంత్రం కల్లా గోతాల్లోకి ఎత్తుకోవడం కన్పించింది. ఎండిన కాయలకు ధరలు బాగావస్తుండటంతో ఎక్కువ మంది తేమ శాతం తగ్గించుకునే ప్రయత్నం చేస్తున్నారు.

ఎమ్మెల్యే ఆధ్వర్యంలో వైసిపి నాయకుల ఆక్రమణలు

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

ప్రభుత్వ భూములు, ప్రైవేట్ భూములు ఆక్రమించుకొని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆధ్వర్యంలో వైసిపి నాయకులు బరితెగించిన వ్యవహారం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే ఎరపతినేని శ్రీనివాసరావు గురువారం ఓ ప్రకటనలో విమర్శించారు. నియోజకవర్గంలో దాదాపు 3 వేల ఎకరాలు ప్రభుత్వ భూములను ఆక్రమించుకొని, సర్వే నెంబర్లు మార్పుచేసి ప్రభుత్వ రికార్డుల్లో కనబడకుండా చేసి అమ్ముకుంటున్నారని ఆరోపించారు. కొన్నిచోట్ల బ్యాంకుల్లో పెట్టి లోన్లు తెచ్చుకుంటున్నారని, కొన్నిచోట్ల అక్రమ మైనింగ్ చేస్తున్నారని పేర్కొన్నారు. పిడుగురాళ్లలో చెరువు ప్రాంతంలో నిషేధిత భూములుగా ఉన్న చెరువు ప్రాంతాన్ని సర్వే నంబర్లు మార్చి ప్రభుత్వ రికార్డ్స్‌లో ఎక్కించి ఎకరం రూ.కోటిన్నరకు అమ్మాలని చూస్తావున్నారని, పిడుగురాళ్ల లోని చెరువు ప్రాంతంలో బైపాస్ రోడ్డు పక్కన ఉన్న 4 ఎకరాల భూమిని ఆక్రమించి సర్వే నంబర్ : 579, మరికొన్ని సర్వే నంబర్లలో అడంగల్ 1బి ఎక్కించి, దానిని అమ్మాలని పిడుగురాళ్ల మండల మాజీ జెడ్పిటిసి రామిరెడ్డి, వీఆర్వో సత్యారెడ్డి, స్టాంపు రైడరు లింగా రెడ్డిలు ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. రెవెన్యూ అధికారులు గానీ, లేకపోతే సబ్ రిజిస్ట్రర్లు గానీ, కన్సన్ ఆర్డీవో అందరూ దీనిపై విచారణ చేసి వెంటనే ఆ స్థలాన్ని ప్రభుత్వ భూమిగా ప్రకటించాలని కోరారు. వైసిపి నాయకులు ఇష్టారాజ్యంగా ప్రభుత్వ భూములను అమ్ముకుంటున్నారో అవన్నీ కూడా టిడిపి ప్రభుత్వం రాగానే విచారణ చేయించడంతోపాటు అక్రమాలకు సహకరించిన అధికారులందరినీ జైలుకు పంపిస్తాంమని హెచ్చరించారు. వైసిపి నాయకులు అమ్మే భూములను ప్రజలు, వ్యాపారులు కొనొద్దని సూచించారు.

రూ.4.45 లక్షల ఎరువులు సీజ్



ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : ఎరువులు పురుగు మందులు, విత్తనాలు దుకాణదారులు నిబంధనలు పాటించకుంటే సీజ్ చేస్తామని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కె.ఈశ్వరరావు హెచ్చరించారు. నరసరావుపేట మండలంలోని కొండకావూరు గ్రామంలోని శ్రీరామకృష్ణ ఎంటర్ ప్రైజెస్ ఎరువుల దుకాణంలో గురువారం తనిఖీలు చేపట్టారు. దుకాణంలో వ్యవసాయ శాఖ నుండి అనుమతులు లేకుండా, రికార్డులో నమోదు చేయకుండా ఎరువులు అమ్ముతున్నట్టు అందిన సమాచారం మేరకు తనిఖీలు చేశామన్నారు. 2 కంపెనీలకు చెందిన ఎరువుల నిల్వలకు రికార్డులకు వ్యత్యాసం ఉందన్నారు. లైసెన్స్, ఆయా కంపెనీల విక్రయ అనుమతి ధ్రువీకరణ పత్రాలు లేవన్నారు. రూ 4.45 లక్షల విలువైన 20 మెట్రిక్ టన్నుల ఎరువులు సీజ్ చేసినట్లు తెలిపారు. తనిఖీల్లో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వ్యవసాయ అధికారి కె.రమణకుమార్, ఎస్ఐ రామచంద్రయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులపై దాడి చేయించిన ఎమ్మెల్యే బొల్లా

టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు జీ.వీ ఆంజనేయులు విమర్శలు

ప్రజాశక్తి - వినుకొండ

బొల్లాపల్లి మండలం వెల్లటూరులో రైతులపై ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు తన అనుచరులతో దాడులు చేయించారని టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు జీవీ ఆంజనేయులు అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. వెల్లటూరులో బేతపూడి అమరలింగయ్య రైతు కుటుంబం మిర్చి పంట సాగు చేస్తున్నారని, ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు తన మనవరాలుకు ఆ భూమిని దక్కించేందుకు అన్యాయం చేసేందుకు సిద్ధమయ్యారని ఆరోపించారు. అమరలింగయ్య భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నించగా 8 సార్లు పల్నాడు జిల్లా కలెక్టర్, జెసి, డిఆర్ఓ, తహశీల్దార్‌కు ఫిర్యాదు చేసిన పట్టించుకోకపోవడంతో రాష్ట్ర గవర్నర్‌కు బాదిత కుటుంబం ఫిర్యాదు చేసిందని, గవర్నర్ ఆదేశాల మేరకు యంత్రాంగం స్పందించి ఆ భూమి అమరలింగయ్యదేనని రెవెన్యూ అధికారులు నిర్ధారించారని తెలిపారు. ఎమ్మెల్యే అధికారాన్ని అడ్డం పెట్టుకొని మండల అధికారులను ఒత్తిళ్లకు గురిచేసి తన అనుచరులత మిర్చి పంట సాగులో ఉన్న వ్యవసాయ బోర్లను కోసి వేయించి, మట్టి రాళ్లతో బోర్లను దౌర్జన్యంగా పూడ్చి వేయించారని మండిపడ్డారు. తమపై దౌర్జన్యం చేసి దాడి చేశారని బండ్లమోటు పోలీస్‌స్టేషన్‌లో అమరలింగయ్య కుటుంబం ఫిర్యాదు చేసి ఆరు రోజులు గడుస్తున్న చర్యలు లేవన్నారు.



విలేకర్లతో మాట్లాడుతున్న జీవీ ఆంజనేయులు

అమరలింగయ్య బోర్లు, వ్యవసాయ పంటను ధ్వంసం చేసిన దుండగులపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా నరసరావుపే ఎంపీ స్థానం నుండి వైసిపి అభ్యర్థిగా మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్‌ను ప్రకటించడంపై జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో బీసీ నాయకులు లేరని పక్క జిల్లా నుండి నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థిగా వైసిపి ప్రకటించడం పట్ల ప్రజలు చీ కొడుతున్నారని అన్నారు. అనిల్ కుమార్ యాదవ్ మంత్రిగా ఎమ్మెల్యేగా బీసీలకు తీరని అన్యాయం చేసి అవినీతి అక్రమాలతో కోట్లు సంపాదించిన వ్యక్తి అని విమర్శించారు. వైసిపి ప్రభుత్వం రిజర్వేషన్లు కోత విధించడం వల్ల 12 వేల మంది బీసీలు పదవులకు దూరమై నష్టపోయారన్నారు. బీసీ కార్పొరేషన్ నిధులు తొలగించి తీరని అన్యాయం చేసిన జగన్‌రెడ్డిని ప్రజలు క్షమించరన్నారు.

ఎన్నికల నిర్వహణ ఒక సవాల్

(మొదటి పేజీ తరువాయి)

బదిలీల్లో భాగంగా గుంటూరు జిల్లా ఎస్‌పిగా నియమితులయ్యారు. బదిలీ అయిన ఎస్‌పి ఆరీఫ్ నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించిన తరువాత ఆయన మీడియాతో మాట్లాడుతూ గుంటూరు లాంటి జిల్లాల్లో పనిచేయడం తమకు ఛాలెంజ్‌గా భావిస్తున్నానని అన్నారు. మహిళల భద్రత పట్ల ప్రత్యేక శ్రద్ధ పెడతామన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. 2018 ఐపిఎస్ బ్యాచ్‌కు చెందిన తుషార్ శిక్షణ అనంతరం పలు జిల్లాల్లో పనిచేశారు. ఐఐటి చదివి ఆ తరువాత సివిల్ సర్వీస్ పరీక్షలు రాసిన తుషార్ 2018లో ఐపిఎస్‌కు ఎంపికయ్యారు. రెండేళ్లుగా అదనపు ఎస్‌పి (అడ్మిన్)గా కడపలో పనిచేస్తూ ఎన్నికల నేపథ్యంలో జరిగిన బదిలీల్లో గుంటూరు జిల్లా ఎస్‌పిగా నియమితులయ్యారు. జిల్లా అదనపు ఎస్‌పిలు సుప్రజ, శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, వెంకటేశ్వరరావు, డిఎస్‌పిలు రత్నస్వామి, శాంతకుమార్ పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి : ఐజి

(మొదటి పేజీ తరువాయి)

అధికారులు కూడా క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు విఘాతం కలిగించేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

సర్కిల్ కార్యాలయంలో తనిఖీ

వినుకొండ రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని ఐజి, ఎస్పీ తనిఖీ చేశారు. ఐజి మాట్లాడుతూ ఆర్థిక నేరాల నియంత్రణకు కృషి చేయాలని, దీర్ఘకాలిక పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని చెప్పారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ప్రజలకు మరింత చేరువ కావాలన్నారు. సైబర్ నేరాలు, లోన్ యాప్‌లపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. శాంతిభద్రతలు స్థాపనలో సచివాలయ మహిళా పోలీసులు భాగస్వాములు కావాలని చెప్పారు. ఫోక్సో కేసులు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెండింగ్‌కు గల కారణాలు తెలుసుకుని, వాటి విచారణ వేగవంతం చేయడానికి పలు సూచనలు చేశారు. రోడ్డు ప్రమాదాలను నివారించడానికి తీసుకున్న చర్యల గురించి సమీక్షించారు. విజబుల్ పోలీసింగ్ నిర్వహించి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చూడాలని, మహిళలు సంచరించే, చీకటి ప్రాంతాల్లో, సమస్యలుండే ప్రదేశాలను గుర్తించి బీట్లను పెంచి గస్తీ ముమ్మరం చేయాలని ఆదేశించారు. అక్రమ మద్యం, అక్రమ ఇసుక, గంజాయి మొదలైన నిషేధిత పదార్థాల అక్రమ రవాణా, నిల్వలుపై దృష్టి సారించాలని సూచించారు. పోలీసుల యోగక్షేమాల విషయంలో సమస్యలుంటే తన దృష్టికి తేవాలని, నిత్యం అందుబాటులో ఉంటానని చెప్పారు. కార్యక్రమాల్లో ఎఎస్పీ (అడ్మిన్) ఆర్.రాఘువేంద్ర ఎఆర్ డీఎస్పీ చిన్నికృష్ణ, డీఎస్పీలు కె.వి మహేష్, పల్లపు రాజు, బి.ఆదినారాయణ, ట్రైనీ డీఎస్పీ జగదీష్, ఎస్‌బి సీఐ ప్రభాకర్, ఎస్‌ఐలు, పాల్గొన్నారు.

వైఎస్ఆర్ ఆసరా చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - విజయపురిసౌత్: మహిళల ఆర్థికాభివృద్ధి కోసం సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో చేస్తున్నారని ప్రభుత్వ విప్, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మాచర్ల పట్టణంలోని మానుకొండ కళ్యాణ మండపంలో వై.యస్.ఆర్ ఆసరా నాలుగో విడత చెక్కులు పంపిణీ కార్యక్రమం గురువారం జరిగింది.



సిఐటియు కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - మంగళగిరి :జిల్లా భవన మరియు ఇతర నిర్మాణ రంగ కార్మిక సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం మంగళగిరి సీఐటీయూ కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిఐటియు సీనియర్ నాయకులు జెవి రాఘవులు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు షేక్ జానీ భాష, పి శంకరరావు నండూరి సురేష, నాయకులు టి శ్రీరాములు, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి బాలకృష్ణ, డివైఎఫ్ఐ నాయకులు ఎస్ వెంకటేష్ పాల్గొన్నారు.



స్టేడియంలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

-ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రద్యుమ్న

ప్రజాశక్తి-గుంటూరు :స్థానిక బ్రహ్మానందరెడ్డి స్టేడియంలో జరుగుతున్న అభివృద్ధి, మరమ్మతు పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర యూత్ అడ్వాన్స్‌మెంట్, టూరిజం, సాంస్కృతిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రద్యుమ్న అధికారులకు సూచించారు. గురువారం స్థానిక బ్రహ్మానందరెడ్డి స్టేడియంలో జరుగుతున్న పనులను ప్రద్యుమ్న , శాప్ మేనేజింగ్ డైరెక్టర్ ధ్యాన్‌చంద్, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి, నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరితో కలసి పరిశీలించారు. స్టేడియంలోని క్రికెట్‌గ్రౌండ్, గ్యాలరీ, డ్రైన్ పనులను పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. స్టేడియం అభివృద్ధిలో భాగంగా స్టేడియానికి బౌండరీవాల్, రోడ్‌సైడ్ కాంప్లెక్స్ కట్టడానికి తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతుందని ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రద్యుమ్న తెలిపారు. స్టేడియం వద్ద 400 మీటర్ల వాకింగ్ ట్రాక్ ఏర్పాటు కూడా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. బాస్కెట్‌బాల్, వాలీబాల్ కోర్ట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రద్యుమ్నను ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో డీటీసీ కరీం, శాప్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సిద్దయ్య, అసిస్టెంట్ ఇంజినీర్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

క్లిష్టతరమైన శస్త్ర చికిత్స విజయవంతం

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి

ప్రభుత్వ ఆసుపత్రి జనరల్ సర్జరీ మూడో యూనిట్ వైద్యులకు డాక్టర్ కిరణ్ కుమార్ అండగా నిలిచి ఒక రోగికి శస్త్ర చికిత్సను విజయవంతం చేశారు. శస్త్ర చికిత్స వివరాలను గురువారం మీడియా కు డాక్టర్ కిరణ్ కుమార్ వెల్లడించారు. ఏలూరు జిల్లా కు చెందిన నూతి దుర్గారావు (62) విపరీతమైన కడుపు నొప్పి తో బాధపడుతున్నాడని చెప్పారు. గత నవంబర్ నుంచి కడుపు నొప్పి రావడం తో మందులతో సరి పెట్టుకోవచ్చని వైద్యులు సూచించారు. ఆవిధంగా గతరెండు నెలల నుంచి మందులను వాడుతున్న ఫలితం కనిపించలేదు. చివరకు జనరల్ సర్జరీ మూడో యూనిట్ ప్రొఫెసర్ డాక్టర్ గోవిందా నాయక్ , వారి వైద్య బృందం కల్సి వివిధ పరీక్షలు చేసారు. ఈ పరీక్షలో పాంక్రీస్ డక్ట్ స్టోన్స్ ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. రోగికి ఆపరేషన్ చేసేందుకు ఈ నెల 17 వ తేదీన ఆసుపత్రి లో చేర్పించినట్లు ఆయన చెప్పారు. మద్యం సేవించడం వల్ల ఇలాంటి రాళ్లు ఏర్పడతాయని అయన చెప్పారు. డాక్టర్ గోవిందా నాయక్ తనను కల్సి



ఆపరేషన్ చేయాలనీ కోరారని అయన చెప్పారు. దాంతో స్వయంగా తనతో పాటు డాక్టర్ గోవిందా నాయక్ , వైద్య బృందం కల్సి ఈ నెల 19 వ తేదీన ఆపరేషన్ చేసినట్లు ఆయన చెప్పారు. పాంక్రీస్ గ్రంధి కి ప్రేగుతో కుట్లు వేసి శస్త్ర చికిత్స విజయవంతం చేసినట్లు ఆయన తెలిపారు. ఈ శస్త్ర చికిత్సలో మూడో యూనిట్ వైద్యులు డాక్టర్ సి హెచ్ శ్రీనివాస రావు, డాక్టర్ యల్ వంశిధర్, పిజి వైద్యులు షేక్ సల్మా బేగం, కె మనీష్ రెడ్డి, తులసి సందీప్, షబ్నం కబీర్, ఆర్ఎంవో డాక్టర్ సతీష్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ ఆశ సజని పాల్గొన్నారు.

ముగిసిన బేస్‌బాల్ టోర్నమెంట్

ప్రజాశక్తి-గుంటూరు

భారత బేస్‌బాల్ జట్టులో స్థానం సంపాదించటమే లక్ష్యంగా ప్రతి క్రీడాకారుడూ కృషి చేయాలని ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజి అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ పేర్కొన్నారు. గత రెండ్రోజులుగా కళాశాలలో జరుగుతున్న ఆచార్య నాగార్జునా యూనివర్సిటీ ఇంటర్-కాలేజియేట్ బేస్‌బాల్(మెన్) టోర్నమెంట్ గురువారం ముగిసింది. ఈ పోటీల్లో సిఆర్ కాలేజి జట్టు ప్రథమ స్థానం, ఆర్‌విఆర్ జట్టు ద్వితీయ స్థానం, ఎంఎల్ అండ్ ఎస్ డిగ్రీ కాలేజి తృతీయ స్థానంలో, యూనివర్సిటీ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ సైన్స్ జట్టు నాలుగో స్థానంలో నిలిచాయి. యుక్త వయస్సులో క్రీడల ద్వారా లభించే శారీరక శక్తి



ఎంపికైన యూనివర్సిటీ జట్టుతో ప్రిన్సిపాల్ తదితరులు

వృద్ధాప్యం వరకూ నిలిచి ఉంటుందని, కావున ప్రతి ఒక్కరూ క్రీడల్లో పాల్గొనాలని కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులకు యూనివర్సిటీ జట్టును ఎంపిక చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ ఎన్.వి.శ్రీనివాసరావు, టోర్నమెంట్ ఆర్గనైజర్ డాక్టర్ పి.గౌరీశంకర్, ఏఎన్‌యు అబ్జర్వర్ డాక్టర్ డి.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



పంట కాల్వలోకి పల్టీ కొట్టిన ఆటో

ఆటో డ్రైవర్ మృతి, ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి - తాడికొండ

పంట కాల్వలోకి ఆటో పల్టీ కొట్టి ఆటో డ్రైవర్ మృతి చెందిన ఘటన తాడికొండ గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. సీఐ ప్రభాకరరావు వివరాల ప్రకారం, వట్టి చెరుకూరు మండలం గారపాడు గ్రామానికి చెందిన పల్లపాటి కోటేశ్వరరావు (49) కంతేరు అడ్డరోడ్డు నుండి ఐదుగురు ప్రయాణికులను ఆటోలో ఎక్కించుకొని తాడికొండ అడ్డరోడ్డు వస్తుండగా తాడికొండ గ్రామ శివారు మలుపు వద్ద అదుపు తప్పి పంట కల్వలోకి పల్టీ కొట్టింది. ప్రమాద స్థలంలోనే కోటేశ్వరరావు మృతి చెందగా ముగ్గురికి గాయలైయ్యాయి. క్షత గాత్రులను చికిత్స నిమిత్తం 108 లో జిజిహెచ్‌కు పోలీసులు తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిజిహెచ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి తెనాలి : స్థానిక రైల్వే స్టేషన్ లో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఒకటో నెంబర్ ప్లాట్ ఫామ్ లో సుమారు 55 సంవత్సరాల వయస్కుడు మతి చెంది ఉండటాన్ని గమనించి, మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి, కేసు నమోదు చేశారు.

బడ్జెట్‌లో చేనేతకు అదనంగా నిధులు కేటాయించాలి

ప్రజాశక్తి - మంగళగిరి

కేంద్ర ప్రభుత్వం చివరి బడ్జెట్‌లో నైనా చేనేతకు ఐదు వేల కోట్ల రూపాయలు, రాష్ట్ర ప్రభుత్వం రెండు వేల కోట్ల రూపాయలు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి బాలకృష్ణ, అధ్యక్షులు కే శివ దుర్గారావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి సంవత్సరానికి రూ.5000 కోట్లు కేటాయిస్తానని వాగ్దానం చేసి ఈ పది సంవత్సరాలు కాలంలో 4 వేల 492 కోట్లు రూపాయలు మాత్రమే కేటాయించి చేనేతకు తీరని అన్యాయం చేశారని వారు పేర్కొన్నారు. వ్యవసాయం తర్వాత చేనేత రంగం ప్రాధాన్యత కలిగిన రంగం అని ఆ రంగానికి ప్రాధాన్యత ఇస్తామని చెప్పిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేనేతకు అన్యాయం చేశాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో నిధులు కేటాయించక పోగా చేనేతపై జిఎస్టి వేయటం, రంగులు రసాయనాలు పట్టు జరీ ధరలు 100శాతం పెంచడంతో చేనేత రంగం తీవ్రంగా నష్టపోయిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేనేతకు బడ్జెట్లో ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. చేనేతలకు నేతన్న నేస్తం పథకం షెడ్డు కార్మికులకు అమలు జరపడం లేదని అన్నారు. ప్రభుత్వమే పవర్ లూం వస్త్రాలు కొనుగోలు చేసి చేనేతను ధ్వంసం చేస్తుందని విమర్శించారు. అందువలన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తమ చివరి బడ్జెట్లో కేంద్ర ప్రభుత్వం 5000 కోట్లు రూపాయలు, రాష్ట్ర ప్రభుత్వం రెండు వేల కోట్ల రూపాయలు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు.

జనన,మరణ ధ్రువీకరణ పత్రాల్లో తప్పులుండరాదు

జిజిహెచ్ సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఇంటి పేరు..ఊరు పేరు.. వయస్సు.. రోగి పేరు.. ఇలా ఓపి స్లిప్‌లో అనేక తప్పులు దొర్లుతున్నాయని వాటిని సరి చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ చెప్పారు. గురువారం జనన మరణ ధ్రువీకరణ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ కేంద్రం నుంచి అనేక తప్పులతో జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు అందుకుంటున్నామని ప్రజల నుంచి ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో ఆయన అధికారులతో చర్చించారు. జనన మరణ ధ్రువీకరణ సర్టిఫికెట్ల లో తప్పులు దొర్లినట్లయితే కార్యలయాల చుట్టూ, అధికారుల చుట్టూ తిరగకుండా ఉండేందుకు ముందుగా రిజిస్ట్రేషన్ కౌంటర్ వద్దనే పటిష్టంగా పేర్లు దొర్లకుండా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని అయన చెప్పారు. ఈ కేంద్రాన్ని పాత ఓపి విభాగం వద్ద మార్చను న్నట్లు ఆయన చెప్పారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు వెంటనే జనన మరణ ధ్రువీకరణ సర్టిఫికెట్ లను అందచేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమం లో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ గోవిందా నాయక్, సివిల్ సర్జన్ ఆర్ ఎం ఓ డాక్టర్ సతీష్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ ఆశా సజని పాల్గొన్నారు.

ఇసుక లారీ సీజ్

ప్రజాశక్తి తెనాలి :అనధికారికంగా ఇసుక తరలిస్తున్న లారీని స్పెషల్ ఎంఫోర్స్మెంట్ బ్యూరో అధికారులు సీజ్ చేశారు. పట్టణంలో గురువారం ఎస్ఈబి బృందం తనిఖీలు చేస్తుండగా ఎలాంటి పత్రాలు లేకుండా ఇసుక తరలిస్తున్న లారీ పట్టుబడింది. దానిని సీజ్ చేసి కేసు నమోదు చేసి పట్టణ త్రీ టౌన్ పోలీసులకు అప్పగించినట్లు సిఐ ఏవి చలం తెలిపారు.



రూ.6.50 లక్షల పురుగు మందులు సీజ్

ప్రజాశక్తి - అచ్చంపేట

మండలంలోని మిట్టపాలెం, పెదపాలెం నందు గల పురుగు మందుల దుకాణాలను మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు గురువారం తనిఖీ చేశారు. మిట్టపాలెంలో ఎన్‌విఆర్ ట్రేడర్స్ నందు సరియైన పత్రాలు లేని రూ.4.47 లక్షల విలువ చేసే 218 లీటర్ల పురుగు మందులు అమ్మకాలు నిలిపేశారు. పెదపాలెంలోని శ్రీ లక్ష్మి నరసింహ ఫెర్టిలైజర్స్‌లో రూ.2.14 లక్షల విలువ చేసే 58 లీటర్లు పురుగు మందులు అమ్మకాలు నిలిపేశారు. స్టాక్ రిజిస్టర్ అప్డేట్ చేసుకోవాలని, ధరల నిల్వ పట్టిక ప్రతీరోజూ అప్డేట్ చేసుకోవాలని దుకాణదార్లకు స్పష్టం చేశారు. పురుగు మందు కొన్న ప్రతి రైతుకూ తప్పని సరిగా బిల్లు ఇవ్వాలని, అనుమతి పత్రాలు ఉండాలని చెప్పారు.




దుర్గారావుతో మాట్లాడుతున్న వి.కృష్ణయ్య తదితరులు

సిపిఎం సీనియర్ నాయకులు ఎవికె దుర్గారావుకు పరామర్శ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సిపిఎం సీనియర్ నాయకులు ఎవికె దుర్గారావును నరసరావుపేట పట్టణంలోని ఆయన నివాసంలో ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య, పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ గురువారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిపై వాకబు చేసి జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. పరామర్శించిన వారిలో పట్టణ కార్యదర్శి సిలార్ మసూద్, నాయకులు డి.శివకుమారి పాల్గొన్నారు.



అధికారుల తీరు అభ్యంతరకరం : సిపిఎం

ప్రజాశక్తి - చిలకలూరిపేట

అధికార పార్టీకి పట్టణ మున్సిపల్ అధికారులు, ఇతర ప్రభుత్వ అధికారులు వత్తాసు పలకటం సమంజసం కాదని సిపిఎం పట్టణ కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక పండరిపురంలోని సిపిఎం కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ స్థానిక కళామందిర్ సెంటర్లో రెండు గంటల కార్యక్రమానికి రెండు రోజులు ప్రజలను ఇబ్బంది పెట్టడమే కాకుండా అధికారుల మొత్తాన్ని వారి ఇష్టానుసారంగా పనులు చేయిచు కోవటం తగదన్నారు. సిపిఎం కార్యాలయం వద్ద చెత్తను తొలగించాలని నాలుగు రోజులుగా కోరుతున్నా తీయించలేదని, ఒకే పనిని పలు మార్లు రావటం, ఫొటోలు తీయటం, మధ్యాహ్నం, సాయంత్రం తీయిస్తామని దాటవేటం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు.



చిలకలూరిపేట



అమరావతి

ప్రజల నుండి సిపిఎం విరాళాల సేకరణ

ప్రజాశక్తి - చిలకలూరిపేట

ప్రజల సమస్య పరిష్కారం కోసం నిత్యం పోరాటాలు చేసే సిపిఎంకు అండగా నిలవాలని, విరాళాలిచ్చి తోడ్పాటు అందించాలని సిపిఎం నాయకులు కోరారు. ఈ మేరకు పట్టణంలో గురువారం ప్రజల నుండి విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ పట్టణ కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సిపిఎం నిత్యం ఉద్యమిస్తోందన్నారు. సామాన్య ప్రజల బాగు కోసం, రాష్ట్ర అభివద్ధి కోసం నిజాయితీగా, నిస్వార్ధంగా పాటుపడుతోందని చెప్పారు. ఎరుగుతున్న ధరలతో, తరుగుతున్న ఆదాయాలతో, నిరుద్యోగంతో సామాన్యులు సతమతమవుతున్నారని, విభజన చట్టంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించారని చెప్పారు. ఈ దశలో కష్టనష్టాల్లో ఉన్న ప్రజల కోసం సిపిఎం అనేక పోరాటాలు చేసిందని గుర్తు చేశారు. ఈ పోరాటాలు, ఉద్యమాలు మరింతగా నిర్వహించేందుకు ప్రజల భాగస్వామ్యం కావాలన్నారు. పదో తేదీ వరకూ విరాళాలు సేకరిస్తామని, ప్రజలు ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు బి.శంకర్రావు, ఎస్.లూథర్, ఎం.విల్సన్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - అమరావతి

సిపిఎం ఆధ్వర్యంలో విరాళాలు సేకరించారు. ఆ పార్టీ మండల కార్యదర్శి బి.సూరిబాబు, ఇతర కార్యకర్తలు కలిసి దుకాణాలు, ప్రధాన వీధిలో విరాళాలు సేకరించారు. సూరిబాబు మాట్లాడుతూ ఉద్యోగ, కార్మిక, రైతు, ప్రజా సమస్యలు పరిష్కారం కోసం సిపిఎం నిత్యం పోరాడుతోందని చెప్పారు. కార్యక్రమంలో సయ్యద్ మోదిన్ వలి, నండూరి రాజు పాల్గొన్నారు.

వైసిపిది నినాదం కాదు.. విధానం..

నరసరావుపేట పార్లమెంట్ స్థానం నుండి అభ్యర్థిగా అనిల్‌కుమార్ ప్రకటనపై మంత్రి, ఎమ్మెల్యేలు



విలేకర్లతో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

బడుగుల సాధికారిత నినాదం కాదని అది తమ పార్టీ విధానమని, ఇందుకు రుజువే నర్సరావుపేట పార్లమెంటు స్థానానికి బీసీ సామాజిక తరగతికి చెందిన అనీల్ కుమార్ యాదవ్ నియామకమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఘన చరిత్ర కలిగిన నర్సరావుపేట నుండి మహానుభావులు ఎందరో పార్లమెంటుకు పోటీ చేశారని, అలాంటి స్థానానికి అనీల్‌కుమార్ యాదవ్‌కు కేటాయించిన సిఎం జగన్‌మోహన్‌రెడ్డి చారిత్రాత్మకమైన నిర్ణయానికి శ్రీకారం చుట్టారని అన్నారు. బడుగ వర్గాలు వెనుకపడ్డ కులాలు కాదని, వారే వైసిపికి వెన్నెముకని అన్నారు. అనీల్‌కుమార్ యాదవ్‌ను ఎంపీగా గెలిపించుకోవాల్సిన బాధ్యత బీసీలపై ఉందన్నారు. లావు శ్రీకష్ణదేవరాయులు పార్టీని వీడడం దుర్మార్గమన్నారు. బీసీల పట్ల టిడిపి అవకాశ వాదంతో వ్యవహరిస్తోందని గుంటూరు మిర్చియార్డు చైర్మన్ ఎన్.రాజనారాయణ విమర్శించారు.

40 వేల మెజార్టీతో గెలుస్తాం : బ్రహ్మనాయుడు

ప్రజాశక్తి - వినుకొండ

నరసరావుపేట పార్లమెంట్ స్థానం నుండి వైసిపి అభ్యర్థిగా అనిల్ కుమార్ యాదవ్‌ను పార్టీ అధిష్టానం ప్రకటించడం ఎంతో సంతోషంగా ఉందని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఇప్పటి వరకు ఆ స్థానాన్ని బీసీలకు ఎప్పుడూ కేటాయించలేదని, తాజా నిర్ణయంతో నరసరావుపేట పార్లమెంట్ స్థానం పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లోనూ వైసిపి గెలవబోతోందని, తాను 40 వేల మెజార్టీతో గెలుస్తానని అన్నారు. సిద్ధం పేరుతో సిఎం నిర్వహిస్తున్న కార్యక్రమాలకు ప్రజలు స్వచ్ఛందంగా వస్తున్నారని అన్నారు. రూ.2.50 లక్షల కోట్ల బడ్జెట్‌తో అనేక సంక్షేమ పథకాలను వైసిపి ప్రవేశపెట్టగా గత టిడిపి ప్రభుత్వ హయాంలో నీరు-చెట్టు, జన్మభూమి కమిటీల పేరుతో రూ.లక్షల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. పదేళ్లు ఎమ్మెల్యేగా కొనసాగిన జీవీ ఆంజనేయులు నియోజకవర్గంలో అభివృద్ధి చేయలేదన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ దస్తగిరి షకీలా, నాయకులు వెంకటరావు పాల్గొన్నారు.

మందలించిన మాట నిజమే : మహేష్‌రెడ్డి

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

సామాన్య కార్యకర్తను పార్లమెంటు సభ్యులుగా నిలబెట్టి గెలిపించే సత్తా ముఖ్యమంత్రి జగన్‌కు ఉందని గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఆర్ అండ్ బి బంగ్లాలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. నరసరావుపేట పార్లమెంట్ నియోజకవర్గంలో ఇప్పటి వరకు వ్యాపార వేత్తలు పోటీ చేశారని, కానీ ఒక సామాన్య కార్యకర్త, బీసీ నాయకుడు అనిల్ కుమార్ యాదవ్‌ను గెలిపించాలని జగన్ భావించారని చెప్పారు. నరసరావుపేట పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలను, ఎంపీ అభ్యర్థిని గెలిపించుకుంటామని చెప్పారు. తన గురించి సామాజిక మాధ్యమాల్లో ఒక ఆడియో వస్తోందని, తాను ఒకర్ని మందలించిన మాట నిజమేనని అన్నారు. తమ పార్టీలో ఉంటూ పదవులు అనుభవిస్తూ ద్వంద వైఖరి వ్యవహరించినందుకు మందలించానని చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ కె.మంగమ్మ వెంకటేశ్వర్లు, మాజీ చైర్మన్ ఎమ్‌డి గఫార్, వైసిపి అధ్యక్షులు సిహెచ్.వెంకట రామారావు, యూత్ అధ్యక్షులు ఎం.సుధీర్, నాయకులు జి.పవన్‌రెడ్డి పాల్గొన్నారు.

చిరుమామిళ్లలో 30 పడకలతో ప్రభుత్వాస్పత్రి

శంకుస్థాపన చేసిన మంత్రి రజిని, వైసిపి సమన్వయకర్త రాజేష్‌నాయుడు

ప్రజాశక్తి - నాదెండ్ల

మండలంలోని చిరుమామిళ్లలో రూ.6 కోట్లతో నిర్మించే 30 పడకల ఆస్పత్రికి రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి విడదల రజిని, వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి రజిని మాట్లాడుతూ విద్య, వైద్య రంగంలో దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా ఏపీలో వైసిపి ప్రభుత్వం విప్లవాత్మక సంస్క రణలు చేపట్టిందన్నారు. నాడు-నేడు పేరుతో ప్రభుత్వా స్పత్రుల ఆధునీకరణ, నూతన ఆసుపత్రుల నిర్మాణం, వైద్య కళాశాలల నిర్మాణం చేపట్టామని, ఆరోగ్య సురక్ష క్యాంపులు, ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ఇంటింటికీ వైద్యాన్ని చేర్చామని చెప్పారు. రాజేష్‌నాయుడు మాట్లా డుతూ ప్రతి ఒక్కరికీ, ముఖ్యంగా పేదలకు ప్రభుత్వ ఆస్ప త్రుల ద్వారా నాణ్యమైన వైద్యం అందించాలనే దిశగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేసిందన్నారు. కార్యక్ర మంలో జెడ్‌పిటిసి కె.మస్తాన్‌రావు, సర్పంచ్ ఎస్.లక్ష్మి, కోటిరెడ్డి, ఉపసర్పంచ్ ఎం.హనుమాయమ్మ, ఎంపిటిసి వై.సునీత, సొసైటీ అధ్యక్షులు కె.వెంకటరెడ్డి పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి విడుదల రజిని, వైసిసి నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు

రూ.52 కోట్లతో జానపాడు ఆర్‌ఒబికి 4న శంకుస్థాపన : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

గురజాల నియోజకవర్గంలో అతిపెద్ద గ్రామమైన జానపాడుకు ప్రధాన సమస్యగా ఉన్న రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం త్వరలో ప్రారంభమవుతుందని, పనులకు ఆదివారం శంకుస్థాపన చేస్తామని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి తెలిపారు. పట్టణానికి గురువారం వచ్చిన ఆయన మాట్లాతూ మరొక 18 నెలల్లో బ్రిడ్జి నిర్మాణం పూర్తవుతుందని అన్నారు. గతంలో జానపాడు నుండి వివిధ పనుల నిమిత్తం పిడుగురాళ్లకి వెళ్లాలంటే రైల్వే గేటు పడటంతో గంటలకొద్దీ వేచి చూడాల్సి వచ్చేదని, ఆర్ఓపి పూర్తయితే ఆ పరిస్థితి ఉండదని అన్నారు. దీంతోపాటు జానపాడు గ్రామంలో భూమి రేట్లు పెరుగుతాయని, గ్రామ భవిష్యత్తు మొత్తం మారబోతుందని అన్నారు.

పేదలకు అండగా పోరాడతాం

రైల్వే స్థల నివాస బాధితులతో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

సమస్యపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని డిమాండ్



బాధితులతో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు

ప్రజాశక్తి-తాడేపల్లి

రైల్వే ట్రాక్‌కు దూరంగా మెయిన్ రోడ్డుకు ఒక్కపక్క ఎందుకు పనికి రాకుండా ఉన్న స్థలాల్లో గత 70 సంవత్సరాలుగా నివసిస్తున్న పేదలకు ఖాళీ చేయాలని, లేకుంటే బుల్డోజర్‌తో కూలుస్తామని అధికారులు చెప్పడాన్ని సిపిఎం రాష్ట్ర కార్యాదర్శి వి శ్రీనివాసరావు తీవ్రంగా ఖండించారు. దశాబ్దాలుగా నివాసముంటున్న పేదలకు ప్రత్యామ్నాయ స్థలాలు చూపకుండా ఖాళీ చేయమనడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దుశ్చర్యకు నిదర్శనమన్నారు. గురువారం తాడేపల్లిలో రైల్వే స్థలాల్లో ఉంటున్న పేదల ఇళ్లను ఆయన పరిశీలించారు. బాధితులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాడేపల్లిలోని వివిధ ప్రాంతాలో సుమారు 950 కుటుంబాలు నివశిస్తున్నారని చెప్పారు. పేదల కంటి మీద కునుకు లేకుండా చేస్తున్న పాలకుల నైజాన్ని ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. ఇళ్లు పడగొట్టడానికి బుల్డోజర్ వస్తే పేదలంతా ఐక్యంగా ఆందోళనకు సిద్ధం కావాలని కోరారు. సిపిఎం పేదలకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సిపిఎం నాయకులు, కార్యకర్తలు పేదలకు న్యాయం జరిగే పోరాటంలో ముందుకు పీఠిన ఉంటారని హామీనిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని పేదల ఇళ్లకు భరోసా కల్పించాల్సిన అవసరం ఉందని చెప్పారు. అవసరమైతే రైల్వేకు రాష్ట్ర ప్రభుత్వం పరిహారం చెల్లించి, మరేదైనా భూమి కొనుగోలు చేసి పేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. గతంలో సిఎం ఆ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు పేదలకు ఇబ్బంది లేకుండా చూస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. పేదల ఇళ్లు తొలగించాలని చూస్తే భవిష్యత్తు కార్యాచరణకు దిగుతామని హెచ్చరించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ ప్రస్తుతం పేదలు నివాసం ఉంటున్న ఇళ్లల్లో అధికారులు రోడ్డు, విద్యుత్, మంచినీరు తదితర అవసరాలు తీర్చారని గుర్తు చేశారు. 30 ఏళ్లు ఒకే చోట నివాసం ఉంటే వారికే ఆ భూమి చెందుతుందని చట్టం చెబుతుందని తెలిపారు. పేదలకు అండగా సిపిఎం నిలబడుతుందని, పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు. జనం రోడ్డు మీదకు వచ్చి ఆందోళన చేస్తేనే ఈ ఉపద్రవం ఆగుతుందని చెప్పారు. ప్రతీసారి రైల్వే అధికారులు రావడం బెదిరించడం నిత్యకృత్యమైందన్నారు. తమ ఇళ్లను రక్షించుకోవడానికి పేదలు పోరాటానికి సిద్ధం కావాలని కోరారు. అందుకు సిపిఎం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. సిపిఎం బృందం వెంకయ్య కొట్టు సెంటర్, రన్నింగ్ రూమ్ సెంటర్, పోతురాజుస్వామి గుడి, ముగ్గురోడ్డు, లంబాడీపేట తదితర ప్రాంతాల్లో పర్యటించింది. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర నాయకులు ఎం.సూర్యారావు, ఎం.సూర్యనారాయణ, జొన్నా శివశంకర రావు, దొంతిరెడ్డి వెంకటరెడ్డి, బూరుగ వెంకటేశ్వర్లు, డి.శ్రీనివాసకుమారి, కె.బాబూరావు, డివి భాస్కరరెడ్డి, వై.బర్నబస్, కె.మేరి, సుభాని, ఆచారి పాల్గొన్నారు.

ఇక్కడి నుంచి కదిలేదిలేదు : బొమ్మాజి మేరి



గత 60 ఏళ్ల నుంచి ఇక్కడ నివాసం ఉంటున్నాం. ఎవరు వచ్చినా ఇక్కడి నుంచి కదిలేది లేదు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా మాకు చేసిందేమీ లేదు. మా ఇల్లు మాకు దక్కే విధంగా చూసిన వారికే మద్దతిస్తాం.

స్థలాలకు పట్టాలివ్వాలి : వీరమ్మ



మేము ఉంటున్న ఇళ్లకు పట్టాలివ్వాలి. ఊరికి ఎక్కడో దూరంగా విసిరేసినట్లు వెళ్లమంటే వెళ్లం. పాలక పార్టీలకు చిత్తశుద్ధి ఉంటే మమ్మల్ని ఆదుకోవాలి.

ఏదేమైనా తేల్చుకుంటాం : వేముల మంగ




స్థలాలు మాకు దక్కే వరకు చావైనా రేవైనా సిద్ధం. ఎర్రజెండా అండతో పోరాటానికి సిద్ధంగా ఉన్నాం.

నిద్ర ఉండటంలేదు : పంతగాని ప్రశాంతి



రైల్వే అధికారుల హెచ్చరికతో నిద్ర మానుకుని బతకాల్సి వస్తుంది. నోటీసులు వచ్చిన ప్రతీసారి భయాందోళనకు గురవుతన్నాం.

తహశీల్దార్‌కు వినతి



తహశీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

రైల్వే స్థలాల్లో నివాసముంటున్న పేదల ఇళ్లను తొలగించవద్దని తాడేపల్లి తహశీల్దార్ వి.నాగిరెడ్డికి సిపిఎం, సిపిఐ నాయకులు గురువారం వినతిపత్రం అందజేశారు. రైల్వే స్థలాల బాధితులెవరూ అధైర్యపడొద్దని, తాము అండగా ఉంటామని, సమస్యను టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని టిడిపి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు చెప్పారు. కార్యక్రమంలో మాజీ కౌన్సి లర్ కేళి వెంకటేశ్వరరావు, పలువురు నాయుకలు పాల్గొ న్నారు. అలాగే సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాల నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్, తాడేపల్లి సహాయ కార్యదర్శి టి.వెంకటయ్య రైల్వే స్థలాల బాధితులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. భయపడాల్సిన పని లేదని, ధైర్యంగా ఉండాలని కోరారు.

వడ్డేశ్వరంలో లబ్ధిదారులకు పట్టాల పంపిణీ

ప్రజాశక్తి- తాడేపల్లి రూరల్

సిపిఎం పోరాట ఫలితం వల్లే ఈ రోజు పేదలకు పట్టాలు అందాయని సిపిఎం సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు, సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతిరెడ్డి వెంకట రెడ్డి అన్నారు. గురువారం ఎంటిఎంసి పరిధిలోని వడ్డేశ్వరం ఎస్సీ కాలనీలో పేదలకు ఇళ్ల పటా ్టలను సబ్ కలెక్టర్ ప్రకాష్ జైన్‌తో కలసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు జొన్నా శివ శంకరరావు మాట్లాడుతూ మన ప్రాంతంలో సిపిఎం పోరాటం వల్లే ఎంతోమంది పేద ప్రజలకు మేలు జరిగిందని, గతంలోను సిపిఎం పోరాట ఫలితం వల్లే ఇందిరా నగర్ పట్టాలు పంపిణీ చేశారని అన్నారు. గత17 సంత్సరాల నుండి అనేకమార్లు పోరాటాలు చేసి, పలుమార్లు జైలుకు కూడా వెళ్లాల్సి వచ్చిందని అన్నారు. పేద ప్రజలు కలసికట్టుగా పోరాటాలు నిర్వహిస్తే ఇలాంటి విజయాలు సాధించవచ్చని, మంగళగిరి నియోజకవర్గం ఎంతోమంది పేదలు ఇళ్ల పట్టాలు లేక తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని, విజయవాడ, గుంటూరు మహానగరాల మధ్య మన ప్రాంతం ఉండడంతో అనేక కరువు ప్రాంతాల నుండి ఇక్కడకు వచ్చి పేద ప్రజలు ప్రభుత్వ, కొండ, రెవిన్యూ, ఇరిగేషన్, అసైన్మెంట్ భూములు కొనుగోలు చేయడమో లేదా ఖాళీ స్థలంలో 30-40 సంవత్సరాల నుండి ఇళ్లు నిర్మించుకుని నివాసముంటు న్నారనీ, ప్రభుత్వ అధికారులు ఆ స్థలాలను రెగ్యులైజేషన్ చేసి, పేదవారికి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామనీ అన్నారు. ప్రభుత్వం వడ్డేశ్వరంలో పట్టాలు అందజేసిన విధంగా మిగిలిన ప్రాంతాల్లో కూడా పట్టాలు ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా తాడేపల్లి తహశీల్దార్ నాగిరెడ్డికి, ఇతర అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు మున్నంగి వివేకానంద రెడ్డి, పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల స్వామిరెడ్డి, బిసి సెల్ జిల్లా నాయకులు కత్తిక రాఘవరావు, కత్తిక మల్లికార్జునరావు, గొడవర్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పట్టాల పంపిణీలో సబ్ కలెక్టర్, సిపిఎం, వైసిపి నాయకులు

కేంద్ర, రాష్ట్ర ప్రజావ్యతిరేక విధానాలపై సిపిఎం విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - మంగళగిరి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని సిపిఎం పార్టీ గుంటూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈమని అప్పారావు కోరారు. గురువారం మంగళగిరిలోని సిపిఎం కార్యాలయంలో మంగళగిరి రూరల్ మండల విస్తృత సమావేశం మండల నాయకులు వుద్దంటి దుర్గారావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టి వేసిందని దీనితో చిన్న సన్నకారు రైతులకు, వ్యవసాయ కార్మికులకు తీవ్రమైన నష్టం చేకూరుతుందని తెలిపారు .వ్యవసాయ కార్మికులకు పనిలేని రోజుల్లో 100 రోజులు పని గ్యారంటీ ఇచ్చే ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నారని అలాగే ఆహార భద్రత చట్టాన్ని కూడా తూట్లు పొడుస్తున్నారని విమర్శించారు. వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా సంవత్సరం పాటు ఢిల్లీ నగరంలో రైతాంగం ఉద్యమం నిర్వహిస్తే ఆ సందర్భంగా ప్రధాన నరేంద్ర మోడీ రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా చట్టం చేస్తామని హామీ ఇచ్చి దాని తుంగలో తొక్కారని విమర్శించారు. అలాగే కొత్త మోటార్ వెహికల్ చట్టాన్ని తీసుకొచ్చి డ్రైవర్లకు తీవ్ర నష్టం చేకూరే విధంగా నిర్ణయాలు చేశారని తెలిపారు. వ్యవసాయ రంగాన్ని కాపాడుకునే దానికోసం దేశ వ్యాప్తంగా ఫిబ్రవరి 16వ తేదీన కార్మిక సంఘాలు ,రైతు సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాలు గ్రామీణ బంద్ కు పిలుపునిచ్చాయని ఈ బంద్ ను జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామాల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలని కోరారు. అలాగే సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు లో భాగంగా ఫిబ్రవరి ఒకటో తేదీ నుండి పదవ తేదీ వరకు ఇంటింటికి తిరిగి ఉద్యమ నిధి వసూలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బి. కోటేశ్వరి ,మండల నాయకులు వి.భారతి, జి. బాబు వరప్రసాద్, పి .ప్రసాద్ ,ఎస్. సుమ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఈమని అప్పారావు





నాయకులకు విరాళం అందచేస్తున్న ఎండి అక్బర్

సిపిఎంకు తోడ్పాటు అందించండి

ప్రజాశక్తి-గుంటూరు : సిపియం గుంటూరు నగర జనరల్ బాడీ సమావేశం స్థానిక బ్రాడీపేటలోని పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. పార్టీ నగర కార్యదర్శివర్గ సభ్యులు కె.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ ప్రజల కోసం సిపియం, సిపియంకు అండగా ప్రజలు అనే నినాదంతో పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా చేపట్టిన విరాళాల సేకరణ క్యాంపెయిన్‌లో పార్టీని ఆదరించాలని కోరారు. సిపియం నగర కార్యదర్శి కె.నళినీకాంత్ మాట్లాడుతూ ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తూ, వాటిపై నిరంతరం పోరాటాలు చేస్తున్న సిపియంకు ప్రజలు ఆర్థిక, హార్థిక సాయం అందించి అండగా నిలవాలని కోరారు. సమావేశంలో ఎండి అక్బర్ రూ.10వేల విరాళ్లం చెక్కును పార్టీ నాయకులకు అందచేశారు. సమావేశంలో పార్టీ నగర కార్యదర్శివర్గ సభ్యులు బి.ముత్యాలరావు, నగర కమిటీ సభ్యులు బి.సత్యనారాయణ, షేక్.ఖాసింవలి, ఆది నికల్సన్, ఖాసింషహీద్, ఎస్.కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



విరాళాలు సేకరిస్తున్న నగర కార్యదర్శి నళినీ కాంత్ తదితరులు

ప్రజాశక్తి-గుంటూరు : రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా గుంటూరు నగరంలో సిపియం నాయకులు, కార్యకర్తలు వివిధ కాలనీల్లో విరాళాల సేకరణ క్యాంపెయిన్ ప్రారంభించారు. గుజ్జనగుండ్ల, పుచ్చలపల్లి సుందరయ్య నగర్, ఎటి అగ్రహారం, బ్రాడీపేట, నెహ్రూ నగర్ శాఖల పరిధిలో విరాళాలు సేకరించారు. ప్రతి ఇంటికీ వెళ్లి సిపియం చేస్తున్న కార్యక్రమాలు, ప్రభుత్వ విధానాలు, ప్రజాలపై భారాలు తెలియజేశారు. పేదల కోసం పనిచేస్తున్న పార్టీని నడపటానికి పేదలే ఆర్థిక సాయం అందించాలని, విరివిగా విరాళాలు అందిం చాలని కోరారు. సందర్భంగా ప్రజల నుండి మంచి స్పందన వచ్చింది. కార్యక్ర మంలో వివిధ కాలనీల్లో సిపియం నగర కార్యదర్శి కె.నళినీకాంత్, కార్యదర్శివర్గ సభ్యులు కె.శ్రీనివాస్, బి.ముత్యాలరావు, నాయకులు నికల్సన్, సత్యనారాయణ, ఖాశింవలి, అక్బర్, బాషా, ఖాసిం షహీద్, రాధ, కళ్యాణి పాల్గొన్నారు.



ఆత్మకూరులో విరాళాలు సేకరిస్తున్న ఈమని అప్పారావు తదితరులు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్ : పేదల పక్షాన పోరాడే సిపిఎంకు విరివిగా విరాళాలు ఇచ్చి ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు పిలుపు. కష్టాల్లో ఉన్న ప్రజలకు అండగా నిలిచి వారి సమస్యలు పరిష్కారానికై నిరంతరం పోరా టాలు చేస్తూ పేద ప్రజల పక్షాన నిలిచే భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ప్రజా ఉద్యమాలను బలోపేతం చేసేందుకు ఉద్యమాలకు విరాళాలు ఇవ్వాలని పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆత్మకూరు గ్రామంలో ప్రజానిధి క్యాంపెయిన్ గురువారం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు, గ్రామ పార్టీ శాఖ కార్యదర్శి వుద్దంటి దుర్గారావు, చిట్టేల గిరిధరరావు, చిట్టేల సీతారామాంజనేయులు, బిట్రా రాంబాబు,ఆనందం బాబ్జి,వెంగళ రామారావు, వద్ది సుబ్రహ్మణ్యం, మునగాల శ్రీను,గౌరబత్తుల లక్ష్మి, మామిడాల శివయ్య పాల్గొన్నారు.



మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - బెల్లంకొండ

మండలంలోని మాచాయపాలేనికి చెందిన మురికిపూడి వెంకటేశ్వర్లు అనారోగ్యంతో మృతి చెందడంతో మట్టి ఖర్చుల నిమిత్తం రూ.5 వేల ఆర్థిక సాయాన్ని మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ అందించారు. మృతుని కుటుంబాన్ని ఫోన్ ద్వారా పరామర్శించారు. దీంతోపాటు మాజీ సర్పంచ్ జి.కొండయ్య ఆధ్వర్యంలో మృతుని కుటుంబానికి టిడిపి నాయకులు అందించారు.

పలు గ్రామాల్లో జనసేన పాదయాత్ర

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి నియోజకవర్గంలో ప్రజలకు చేరువయ్యేందుకు జనసేన మహాపాదయాత్ర చేపట్టిందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొర్రా వెంకట అప్పారావు అన్నారు. మండలంలోని కొమరపూడి నుండి ఆయన పాదయాత్రను గురువారం ప్రారంభించారు. గ్రామాల్లోని వంగవీటి మోహనరంగ, ఎన్‌టిఆర్ విగ్రహాలకు పూలమాలలేస్తూ ఎర్రగుంటపాడు, గార్లపాడుకు చేరుకున్నారు.

విధుల్లోకి నూతన ఎంపిడిఒ మల్లీశ్వరి

ప్రజాశక్తి - పెదకూరపాడు



పెదకూరపాడు ఎంపిడిఒగా పి.మల్లీశ్వరి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఏలూరు జిల్లా ముదినేపల్లి ఎంపిడిఒగా పనిచేస్తూ ఇటీవల చేపట్టిన బదిలీల్లో పెదకూరపాడుకు నియమితులయ్యారు. ఆమెను పంచాయతీ కార్యదర్శులు, ఈవోపీఆర్డీ కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

పెదకూరపాడు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా రాజు

పెదకూరపాడు మండల కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా కావూరి సాల్మన్‌రాజు గురువారం బాధ్యతల చేపట్టారు. జిల్లా పరిషత్ సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ ఇక్కడకు ప్రమోషన్ బదీలపై వచ్చారు. పెండింగ్ పనులు లేకుండా చూడడానికి ప్రాధాన్యమిస్తామని చెప్పారు.

సిపిఎస్‌ను రద్దు చేసే వారికే ఉపాధ్యాయుల ఓటు

ప్రజాశక్తి - మాచర్ల

సిపిఎస్ రద్దు చేసే వారికే రానున్న ఎన్నికల్లో ఉపాధ్యాయులు ఓటు వేస్తారని ఎస్టీయు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి యు.చంద్రజిత్‌యాదవ్ అన్నారు. స్థానిక బాలిక హైస్కూల్‌లో ఎస్టీయు అధ్యక్షులు ఎక్స్‌మాస్‌జాన్ అధ్యక్షతన ప్రాంతీయ సమావేశం గురువారం జరిగింది. చంద్రజిత్‌యాదవ్ మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అన్ని రంగాల్లో తిరోగమన దిశగా పని చేస్తోందన్నారు. అనేక పోరాటాల ఫలితంగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం అప్రంటీస్ విధానాన్ని రద్దు చేస్తే నేడు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తిరిగి అప్రంటీస్ విధానాన్ని ప్రవేశపెట్టాలని నిర్ణయంచడం దుర్మార్గమైన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగులకు ఐఆర్, పిఆర్‌సి లేవని, దాచుకున్న డబ్బుకు రక్షణ లేకుండా పోయిందని విమర్శించారు. సమావేశంలో నాయకులు గంగాధర్‌బాబు, పి.నరసింహరావు, కె.కిషోర్, జె.బాలునాయక్ పాల్గొన్నారు.

ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన శంకరరావు

ప్రజాశక్తి - రెంటచింతల

ఎంపిడిఒగా పి.శంకరరావు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయన గతంలో కృష్ణాజిల్లా ఆగిరిపల్లిలో పని చేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకూ ఇక్కడ పని చేసిన మహాలక్ష్మి ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడుకు బదిలీ అయ్యారు.



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎఎన్ఎంలు, హెల్త్ సెక్రెటరీలు

అర్హులకు ప్రమోషన్ల కోసం వినతి

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

తమ సమస్యలను పరిష్కరించాలని గ్రామ వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఎఎన్ఎం, హెల్త్ సెక్రెటరీల కోరారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ గిరికుమార్‌కు గురువారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సచివాలయం హెల్త్ సెక్రటరీలును ఎంపిహెచ్ఎ ఫిమేల్ గ్రేడ్-2గా అర్హులైన వారికి ప్రమోషన్ ఛానల్‌ను వెంటనే కల్పించాలని కోరారు. సచివాలయ వ్యవస్థలో 14 వేల మందికి పైగా ఎఎన్ఎంలు, వార్డుహెల్త్ సెక్రెటరీలు పనిచేస్తున్నారని, కోవిడ్ లాంటి కీలక సమయంలో ప్రాణాలు సైతం లెక్కచేయకుండా వైద్య సేవలు అందించామని చెప్పారు. ప్రస్తుతం అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని, వాటిని పరిష్కరించాలని కోరారు. 2019 నుండి ఆర్‌సిహెచ్ ఆన్‌లైన్ వర్క్‌ను ఇప్పటివరకు సచివాలయం హెల్త్ సెక్రటరీలు చేశారని, అందుకు సంబంధించిన అలవెన్స్ ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని వాపోయారు. హెల్త్ సెక్రటరీలకు 179 జీఓ ప్రకారం అర్హులైన వారికి గ్రేడ్-2 ప్రమోషన్ ఇవ్వాలని కోరారు.

చంద్రబాబు మోసం చేస్తే మేము మాఫీ చేశాం..

డ్వాక్రా మహిళలకు ఆసరా చెక్కుల పంపిణీలో మంత్రి అంబటి రాంబాబు




ప్రజాశక్తి - నకరికల్లు

అర్హతున్న ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిదేనని రాష్ట్ర జలవనరుల శాఖమంత్రి అంబటి రాంబాబు అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన వైఎస్ఆర్ ఆసరా చెక్కు పంపిణీలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ డ్వాక్రా మహిళలకు నాలుగు విడతల్లో రుణమాఫీ చేస్తానని ఇచ్చిన మాటను జగన్ నెరవేర్చారని, మండలంలో నాలుగు విడతలుగా డ్వాక్రా మహిళలకు రూ.32 కోట్లు మాఫీ అయ్యిందని చెప్పారు. గతంలో చంద్రబాబు మాత్రం రుణమాఫీ అంటూ రైతులను మోసం చేశారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేశామని, వచ్చే ఎన్నికల్లో వైసిపిని మరోసారి ఆదరించాలని కోరారు. డిఆర్‌డిఎ పీడీ బాలునాయక్, ఎంపిపి ఎం.అనురాధ, వైసిపి మండల కన్వీనర్ బి.రాఘవరెడ్డి, వైస్ ఎంపీపీలు ఎం.ప్రవీణ్ కుమార్‌రెడ్డి, హుస్సేన్ బి భాష, నాయకులు పి.సూరిబాబు, సర్పంచ్ పి.అంజమ్మ, ఎపిఎం సునీత పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

మండలంలోని జానపాడు, పందిటివారిపాలెం, గుత్తికొండ, జూలకల్లు గ్రామాల్లో చెక్కులను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ జానపాడులో రూ.2.70 కోట్లను డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేసినట్లు చెప్పారు. పందిటివారిపాలెంలో రూ.21 లక్షలు, గుత్తికొండలో రూ.2.36 కోట్లు, జూలకల్లులో రూ.1.22 కోట్లు మాఫీ అయ్యిందన్నారు. గుత్తికొండలో రూ.3.97 కోట్లు, పందిటివారిపాలెంలో రూ.1.69 కోట్లు, జానపాడులో రూ.2.88 కోట్లు, జూలకల్లులో రూ.2.21 కోట్లతో నిర్మించిన సిసి రోడ్లను ప్రారంభించారు. జలజీవన్ మిషన్ ద్వారా రూ.9.90 కోట్లతో పనులకు శంకుస్థాపన చేశారు. ఎంపిపి ఎ.సత్యవతి పిచ్చిరెడ్డి, మండల అభివద్ధి కమిటీ చైర్మన్ ఎం.వెంకటేశ్వరరెడ్డి, యు.నరసింహారావు, పంచాయతీరాజ్ ఏఈ సత్యనారాయణ, నీటి పారుదల శాఖ డిఈ అలెక్స్, పంచాయతీ సెక్రటరీలు, అధికారులు పాల్గొన్నారు.



కన్నా ఎన్నికల ప్రచారం ప్రారంభం

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

అన్ని వర్గాలను మోసం చేసిన వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దించాలని టిడిపి నియోజవకర్గ ఇన్‌ఛార్జి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని గుజ్జర్లపూడిలో ఎన్నికల ప్రచారానికి లక్ష్మీనారాయణ గురువారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా స్థానిక ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలేసి నివాళులర్పించారు. అనంతరం ప్రతి ఇంటికీ వెళ్లి టిడిపి మినీ మేనిఫెస్టోను టిడిపి-జనసేన కూటమిని బలపరచాలని కోరారు. మండల అధ్యక్షులు ఎ.అమరేశ్వరరావు, నాయకులు వై.రామస్వామి, బి.వందనాదేవి, సిహెచ్.శ్రీనివాసరావు, పి.వెంకట కోటయ్య, ఎం.రామచంద్రరావు ఎ.సాంబయ్య, కె.వెంకటేశ్వర్లు, టిడిపి, జనసేన శ్రేణులు పాల్గొన్నారు.

ఆటో వర్కర్స్ యూనియన్ కార్యాలయం ప్రారంభం

సత్తెనపల్లి ఆటోనగర్‌లో మిత్ర ఆటో వర్కర్స్ యూనియన్ కార్యాలయాన్ని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కన్నా లక్ష్మీనారాయణ గురువారం ప్రారంభించారు. ఆటోనగర్ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఆయన్ను కార్మికులు సన్మానించారు. టిడిపి రాష్ట్ర కార్యనిర్వాక కార్యదర్శి వై.రామస్వామి, యూనియన్ నాయకులు, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.



గుజ్జర్లపూడి ఎన్నికల ప్రచారంలో కన్నా లక్ష్మీనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ అరవిందబాబు

ఎమ్మెల్యే శ్రీనివాసరెడ్డికి ఓటమి భయాన్ని పుట్టించాలి : అరవిందబాబు

ప్రజాశక్తి - నరసరావుపేట

బీసీలకు రాజకీయ భవితవ్యం టిడిపితో ముడిపడి ఉందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. నరసరావుపేటలో ఆదివారం నిర్వహించే జయహో బీసీ కార్యక్రమం విజయవంతం కోసం స్థానిక టిడిపి కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర నాయకులు వి.సింహాద్రి యాదవ్ అధ్యక్షతన గురువారం సమావేశం నిర్వహించారు. అరవిందబాబు మాట్లాడుతూ బీసీలకు రాజకీయ పదవులిచ్చింది ఎన్టీ రామారావని, తాను నరసరావుపేట నుండి గెలవడానికి బీసీలంతా సహకరించాలని కోరారు. జయహో బీసీ కార్యక్రమాన్ని చూసి ఎమ్మెల్యే శ్రీనివాసరెడ్డి గుండెల్లో ఓటమి భయాన్ని పుట్టాలన్నారు. సమావేశంలో నాయకులు కె.కోటిసుబ్బారావు, టి.నరసింహారావు, పి.బసవేశ్వరరావు, కె.చంద్రశేఖర్, ఎం.ఆంజనేయులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - రొంపిచర్ల

నరసరావుపేటలో ఈ నెల 4న టిడిపి ఆధ్వర్యంలో జరిగే జయహో బిసి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మండలంలో సంతగుడిపాడు, రొంపిచర్ల, ఆరేపల్లి, వడ్లమూడివారిపాలెం, రామిరెడ్డిపాలెం తదితర గ్రామాల్లో ప్రచారం చేశారు. టిడిపి బిసి సెల్ మండల అధ్యక్షులు మంజుల ఆంజనేయులు మాట్లాడారు. కె.బాలు, కృష్ణ చైతన్య, పి.శ్రీను, పి.బ్రహ్మయ్య పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు రెండు బోర్లు

ప్రజాశక్తి - రెంటచింతల



మండలంలోని పాల్వాయిలో నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టినట్లు సర్పంచ్ మందలపు విజయలక్ష్మి లచ్చిరెడ్డి అన్నారు. ఈ మేరకు గురువారం రజక వీధిలోనే సత్రం వద్ద ఒక బోరు, మరొక ప్రాంతంలో మరో బోరును వేసినట్లు చెప్పారు. ఇప్పటికే 11 బోర్లను వివిధ ప్రాంతాల్లో వేశామన్నారు. కార్యక్రమంలో ఎం.హనీమిరెడ్డి, మాజీ సర్పంచి ఎం.ఆదిలక్ష్మి శ్రీనివాసరెడ్డి, సొసైటీ మాజీ చైర్మన్ కోటిరెడ్డి పాల్గొన్నారు.

సత్తెనపల్లి ఎంపిడిఒగా జగదీష్

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్




సత్తెనపల్లి ఎంపిడిఒగా ఎన్.జగదీష్ గురువారం భాద్యతలు చేపట్టారు. ప్రకాశం జిల్లా అర్ధవీడు ఎంపిడిఒగా పనిచేస్తున్న జగదీష్ బదిలీపై సత్తెనపల్లి వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన జీవి సత్యనారాయణ ప్రకాశం జిల్లాకు అద్దంకి బదిలీ అయ్యారు. నూతన ఎంపిడిఒకు సిబ్బంది స్వాగతం పలికారు.

లాయర్ల డెత్ బెనిఫిట్ రూ.10 లక్షలకు పెంచాలి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

న్యాయవాదుల వెల్ఫేర్ ఫండ్, డెత్ బెనిఫిట్‌ను రూ.10 లక్షలకు పెంచాలని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎన్.వేణుగోపాల్ డిమాండ్ చేశారు. సత్తెనపల్లిలో గురువారం ఆయన మాట్లాడుతూ డెత్ బెనిఫిట్ రూ.4 లక్షల నుండి రూ.5 లక్షలకు అంటే లక్ష మాత్రమే పెంచారని, వెల్ఫేర్ స్టాంప్ రూ.100 నుండి రూ.250కు పెంచారని చెప్పారు.

వంద రూపాయలు వెల్ఫేర్ ఫండ్ స్టాంప్ ఉన్నప్పుడు 4 లక్షల డెత్ బెనిఫిట్ ఇచ్చారని తెలిపారు. ప్రస్తుతం వెల్ఫేర్ ఫండ్ స్టాంప్ 250/-రూ లకు పెంచనందున డెత్ బెనిఫిట్ 10 లక్షలకు పెంచాలని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (%క్ష్మీూూ%) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, న్యాయవాది, నరిశేటివేణుగోపాల్ ఎపి బార్ కౌన్సిల్, ఎపి రాష్ట్ర ప్రభుత్వంను డిమాండ్ చేశారు.



వెయిట్‌లిఫ్టర్ వంశీకి సన్మానం

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్ :పొన్నూరు మండలం మునుకుదురు గ్రామానికి చెందిన సిహెచ్ వంశీ ఇటీవల జరిగిన తమిళనాడులోని చెన్నైలో (ఖేలోఇండియా) నేషనల్ వెయిట్ లిఫ్టింగ్ అండర్-18 ఛాంపియన్షిప్ లో గోల్డ్ మెడల్ సాధించారు. వంశీని గురువారం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పొన్నూరు నియోజకవర్గ ముస్లిం మైనారిటీ సీనియర్ నాయకులు షేక్ నాజర్ ఘనంగా సన్మానించారు. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి ప్రభుత్వం నుండి వంశీకి రావాల్సిన సహాయాలను మాట్లాడతా నన్నారు. కార్యక్రమంలో పొన్నూరు పట్టణ ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు మొల్ల కరీం, రాజధాని డెవలపర్స్ షేక్ ఖయ్యూం, షేక్ ఆలీషా , చంద్రశేఖర్ , ములుకుదురు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ తాడికొండ రత్నబాబు, ములుకుదురు ఎం.పీ.టీ.సీ కే.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మంగళగిరిలో పోటీకి ధరఖాస్తు అందజేస్తున్న కంతేటి

మంగళగిరి నుండి పోటీకి కంతేటి దరఖాస్తు

అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని కాంగ్రెస్ నేతలకు వినతి

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా తన అభ్యర్థత్వాన్ని పరిశీలించాలని కోరుతూ మంగళగిరికి చెందిన పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కంతేటి జీవన్ సాగర్ గురువారం కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి దరఖాస్తును విజయవాడ పీసీసీ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా కంతేటి మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గంలో 70 వేల మంది ఎస్సీ ఓటర్లు ఉన్నారని, తన భార్య సామాజిక తరగతికి చెందిన పద్మశాలీలు సుమారు 40 వేల పైగా ఉన్నారన్నారు. తాను నియోజకవర్గంలో అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేయడానికి అర్హుడునని అన్నారు. కార్యక్రమంలో పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కూర్మాల రాధిక, కాంగ్రెస్ నాయకులు కురగంటి చిన్న రత్తయ్య, కట్టిపోగు వెంకట రత్తయ్య, పోలుమట్ల దేవకుమార్ పాల్గొన్నారు.



ఆత్మకూరులో ఎన్ఎస్ఎస్ క్యాంప్

ప్రజాశక్తి - మంగళగిరి

పల్లెలు దేశ సౌభాగ్యానికి పట్టుకొమ్మలు, అందుకే పల్లెలు బాగుపడితే దేశం అభివృద్ధి చెందుతుందని అలాంటి పల్లెలను సంస్కరించడానికి ప్రతి పౌరుడు కృషి చేయాలని మంగళగిరి వి జె డిగ్రీ కళాశాల డైరెక్టర్ ప్రగడ రాజశేఖర్ అన్నారు. గురువారం వీజీ కళాశాల ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపును ఆత్మకూరులో ప్రారంభించారు. వి జె కళాశాల దత్త గ్రామమైన ఆత్మకూరు గ్రామంలో కళాశాల వాలంటీర్లచే ప్రిన్సిపాల్ నాదెళ్ల శ్రీనివాసరావు, ప్రోగ్రాం ఆఫీసర్ ఎస్ శంకర్ జి సురేష్, పర్యవేక్షణలో ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంప్ ఏర్పాటు చేశారు. గ్రామాభివృద్ధి, పరిశుభ్రత కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు చురుగ్గా పాల్గొన్నారు. వాటర్ బెడ్ క్లీనింగ్ మరియు పరిసర ప్రాంతాలను అభివృద్ధి చేసి గ్రామస్తులలో అవగాహన కల్పించినారు.

అమరావతి అభివృద్ధిలో చిన్నచూపు లేదు

పింఛను పెంపుపై ముఖ్యమంత్రితో మాట్లాడతా : వెంకటపాలెంలో మాజీ మంత్రి సుచరిత

ప్రజాశక్తి - తుళ్లూరు

అమరావతి సామాజిక జీవనభృతి రూ 2,500 నుంచి రూ.5 వేలకు పెంచే అంశాన్ని ముఖ్యమంత్రిదృష్టికి తీసుకు వెళతానని ప్రత్తిపాడు ఎమ్మెల్యే, నియోజక వర్గ సమన్వయ కర్త మేకతోటి సుచరిత చెప్పారు. గురువారం రాజధాని ప్రాంతం వెంకటపాలెం లోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో సుచరిత పూజలు నిర్వహించారు. అనంతరం దేవస్థానం వెలుపల ఆమె విలేకరులతో మాట్లాడారు. రాజధాని అమరావతి అభివృద్ధి పట్ల ప్రభుత్వానికి ఎలాంటి చిన్న చూపు లేదన్నారు.ఈ ప్రాంతంలో 50 వేలకు పైగా పేదలకు ఇళ్ళ స్థలాలు ఇచ్చామని, 80 శాతం పైగా ప్రజలు సంక్షేమ పథకాల వల్ల లబ్ధి పొందారని చెప్పారు. అమరావతి న్యాయ రాజధానిగా కొనసాగుతుందని, అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలనేది ప్రభుత్వ ఉద్దేశమన్నారు. రైతులు, మహిళలు రాష్ట్ర ఏకైక రాజధానిగా అమరావతిని కొనసాగించాలని ఉద్యమం చేస్తున్న విషయం ప్రస్తావించగా సుచరిత సమాధానం చెప్పేందుకు సిద్ధమౌతుండగా ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ ' సరే సరే తరువాత మాట్లాడతారు.. ఇక్కడే ఉంటారు గదా.. అని అనడంతో సుచరిత మాట్లాడకుండానే



వెంకటపాలెంలో మాట్లాడుతున్న సుచరిత

అక్కడనుంచి వెళ్ళిపోయారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. వివిధ గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. పార్టీ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ పరిశీలకులు బి బ్రహ్మానందరెడ్డి, నాయుడు నాగేశ్వరరావు, కొప్పుల శేషగిరి రావు, దానం వినోద్, శంగారపాటి సందీప్, తుమ్మూరు రమణారెడ్డి,బండి ప్రసాద్, గాదె నాగేశ్వరరావు పాల్గొన్నారు.

దళిత, ఆదివాసీల సమస్యలపై మ్యానిఫెస్టో

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్రంలో 25 శాతంగా ఉన్న దళిత, ఆదివాశీల ఆకాంక్షల అక్షర రూపమే దళిత ఆదివాసీ మ్యానిఫెస్టో-2024 అని దళిత, బహుజన రిసోర్స్ సెంటర్ కార్యదర్శి అల్లాడి దేవకుమార్ పేర్కొన్నారు. గురువారం స్థానిక బ్రాడీపేటలోని జాషువా విజ్ఞాన కేంద్రంలో 'ఆంధ్రప్రదేశ్ దళిత, ఆదివాసీ మ్యానిఫెస్టో-2024' విడుదల చేశారు. ఈ సందర్భంగా దేవకుమార్ మాట్లాడుతూ డిబిఆర్సి ఆధ్వర్యంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో ఆదివాసీల సంక్షేమం, అభివృద్ధి, సాధికారత కోసం కృషి చేస్తున్న వివిధ నాయకులు, సంఘాలు, సంస్థలతో సంప్రదింపులు జరిపి, ఈ మ్యానిఫెస్టోను రూపొందించినట్లు వివరించారు. రాష్ట్రంలోని దళితులు, ఆదివాసీలు, సంచార జాతులకు చెందిన ప్రజలు ఎదుర్కొంటున్న సవాళ్ల పరిష్కారం కోసం నిర్ధిష్టమైన ప్రతిపాదనలు రూపొందించినట్లు తెలియజేశారు. బడ్జెట్, భూమి, ఇళ్లు, విద్య, ఆరోగ్యం, సామాజిక భద్రతకు సంబంధించిన హామీలను అన్ని రాజకీయ పార్టీలు తమ తమ మ్యానిఫెస్టోలలో పొందుపరచాలని కోరారు. మాల మహానాడు జాతీయ అధ్యక్షులు గోళ్ల అరుణ్‌కుమార్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఆదివాసీ, దళిత అజెండా ఒక ప్రధాన అజెండాగా మార్చాలనే లక్ష్యంతో తాము ముందుకు వెళుతున్నట్లు చెప్పారు. సబ్‌ప్లాన్ నిధులు దళిత, ఆదివాసీల సంక్షేమానికి మాత్రమే వినియోగించాలని అన్నారు. కార్యక్రమంలో మేడ్ రాష్ట్ర అధ్యక్షులు మురికిపూడి దేవపాల్, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు మేడిద బాబూరావు, మల్లెల చిన్నప్ప, ఎస్.జ్యోతి, డి.కోటేశ్వరరావు, భగవాన్‌దస్, డాక్టర్ రమణమూర్తి, యం.హేమలత తదితరులు పాల్గొన్నారు.



మ్యానిఫెస్టో విడుదల చేస్తున్న అల్లాడి దేవకుమార్ తదితరులు

ఎఎస్ఐ రామకోటేశ్వరరావుకు ఆత్మీయ వీడ్కోలు

ప్రజాశక్తి తెనాలి

వృత్తి పట్ల ఎంతో నిబద్ధత, అంకిత భవం కలిగిన వ్యక్తి రామ కోటేశ్వరరావు అని టూ టౌన్, త్రీటౌన్ సీఐలు ఎస్ రమేష్ బాబు, అద్దంకి సుధాకర్ అన్నారు. త్రీ టౌన్ పోలీస్ స్టేషన్లో ఏఎస్ఐ గా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన వాకా రామ కోటేశ్వరరావు అభినందన కార్యక్రమం 3 టౌన్ పోలీస్ స్టేషన్లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రమేష్ బాబు మాట్లాడుతూ రామకోటేశ్వరరావు తనకు అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నెరవేర్చేవారని, సమయపాలన పాటించేవారని కొనియాడారు. ప్రస్తుతం ఎమ్మెల్యే శివకుమార్ బందోబస్తు విధుల్లో ఉన్నప్పటికీ అందరి మన్ననలూ పొందారన్నారు. టూ టౌన్ సిఐ అద్దంకి సుధాకర్ మాట్లాడుతూ ఉద్యోగ విరమణ అనంతరం భావి జీవితం సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. స్టేషన్ సిబ్బందితో కలిసి రామకోటేశ్వరరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో త్రీటౌన్ ఎస్ఐలు వెంకటేశ్వరరావు, ఎన్. ప్రకాశరావు, ఏఎస్ఐలు దేవప్రసాద్ ,బి.రమేష్ బాబు, షేక్ హైదర్ ఆలి పాల్గొన్నారు.



ఎఎస్ఐ రామకోటేశ్వరరావును సత్కరిస్తున్న సిఐలు

యువ వ్యాపారవేత్తలు అవకాశాలను అందిపుచ్చుకోవాలి

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

యువ వ్యాపారవేత్తలు, వ్యాపార రంగంలోకి అడుగు పెట్టాలనుకునే విద్యార్థులు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సెక్యూరిటీ ఎక్చేంజిబోర్డ్ ఆఫ్ ఇండియా అసిస్టెంట్ మేనేజర్ సుస్మిత శెట్టి అన్నారు. గురువారం కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీలోని ఎంబిఎ విభాగంలో ఏర్పాటు చేసిన క్యాపిటల్ మార్కెట్ నుండి యువ వ్యాపారవేత్తలు అవకాశాలను ఏ విధంగా సద్వినియోగం చేసుకోలి అనే అంశం మీద సదస్సు నిర్వహించారు. సదస్సులో ముఖ్య అతిథులుగా సెక్యూరిటీ ఎక్చేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా అసిస్టెంట్ మేనేజర్ సుస్మితశెట్టి, బొంబాయి స్టాక్ చేంజ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కొండా నాగభూషణ్, సి డి ఎస్ ఎల్ హైదరాబాద్ రీజినల్ హెడ్ శివప్రసాద్ ప్రసంగించారు. స్టాక్ మార్కెట్‌కి నమ్మకము, పారదర్శకత అనేవి పునాది అని అభివర్ణించారు. పెట్టుబడిదారుల రక్షణ నిధి గురించి, ద్రవ్యత స్థితి



సదస్సులో ప్రసంగిస్తున్న కొండా నాగభూషణ్

మరియు విశ్వసనీయత మొదలైన అంశాల గురించి వివరించారు. కంపెనీలను జాబితాలో చేర్చడం వల్ల యువ వ్యాపారవేత్తలకు లభించే అవకాశాలను ఒకే వ్యక్తి కంపెనీ ఏర్పాటు చేయడంలో ఉండే సౌలభ్యతలను వివరించారు. కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ కె.హేమదివ్య, వర్శిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, డాక్టర్ ఎవిఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్. వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎంపిడిఓలు



ప్రజాశక్తి - కొల్లిపర :కొల్లిపర ఎంపీడీఎ గా బి వై విష్ణు ప్రసాద్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ప్రభుత్వ బదిలీల్లో భాగంగా కృష్ణాజిల్లా రెడ్డిగూడెం మండలం నుండి బదిలీపై కొల్లిపర ఎంపీడీవోగా వచ్చారు. ఎంపీడీవో బివై విష్ణు ప్రసాద్‌ను ఎంపీపీ భీమవరపు పద్మావతి మండల పరిషత్ సిబ్బంది రెవెన్యూ సిబ్బంది స్వాగతించారు.



ప్రజాశక్తి - చేబ్రోలు: చేబ్రోలు ఎంపీడీవోగా కె జ్యోతి బాధ్యతలు చేపట్టారు. ప్రభుత్వ బదిలీల్లో భాగంగా కృష్ణాజిల్లా జిల్లా, చందర్ల పాడు ఎంపిడిఒగా విధులు నిర్వహిస్తున్న జ్యోతి చేబ్రోలు బదిలిపై వచ్చారు. జ్యోతికి ఇఒపిఆర్‌డి శ్రీనివాసరావు, ఎఒ ఉమాదేవి తదితరులు స్వాగతం పలికారు.



ఈమనిలో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ తదితరులు

పేదల కోసమే ప్రభుత్వ భవనాలు

ఈమనిలో సచివాలయ భవనాన్ని ప్రారంభించిన గంజి చిరంజీవి

ప్రజాశక్తి - దుగ్గిరాల

పేదలు, రైతుల ప్రయోజనం కోసం దీర్ఘకాలిక భవనాల నిర్మాణాలను ప్రభుత్వం ప్రారంభించిందని వైసిపి నాయకులు గంజి చిరంజీవి అన్నారు. మండలంలోని ఈమని గ్రామంలో రూ.67.54 లక్షల ఉపాధి నిధులతో నిర్మించిన ఆర్‌బికె, సచివాలయం భవనాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌బికెలు, సచివాలయాల ద్వారా గ్రామీణ ప్రజలకు సేవలు అందిస్తున్నారన్నారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ వైఎస్‌ఆర్సిపి ప్రభుత్వ లక్ష్యం ప్రజలకు చేరువటమేనన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సిద్ధల శ్రీవాణి ఉజ్వల హరిణి మండల వైస్ ప్రెసిడెంట్ పసుపులేటి సాయి చైతన్య గ్రామ కార్యదర్శి డి నవరాణి తదితరులు పాల్గొన్నారు. గొడవర్రు, పెదకొండూరులో ప్రారంభోత్సవ కార్యక్రమాలను సర్పంచ్ వి ఉమాదేవి, మేదరి సౌజన్య ప్రారంభించారు.



యూనిఫారం అందచేస్తున్న మేయర్, తదితరులు

జిఎంసి కార్మికులకు యూనిఫారం అందజేత

ప్రజాశక్తి-గుంటూరు

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చిరుద్యోగులు, కార్మికుల పక్షపాతి అని నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు అన్నారు. గురువారం జిఎంసి వెహికల్ షెడ్‌లో విధులు నిర్వహిస్తున్న డ్రైవర్లకు, క్లీనర్లకు నగర పాలక సంస్థ అందిస్తున్న యూనిఫాంను మేయర్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఎంతగానో కృషి చేస్తుందన్నారు. జిఎంసిలో విధులు నిర్వహిస్తున్న చిరుద్యోగులైన అవుట్ సోర్సింగ్ కార్మికులు, ఉద్యోగుల సంక్షేమం కోసం ఇన్సూరెన్స్ కంపెనీలకు వారు చెల్లించాల్సిన ప్రీమియం రుసుమును జిఎంసి చెల్లిస్తుందన్నారు. అంతేకాక వారికి యూనిఫాం, దుస్తులు అందజేస్తున్నామని తెలియచేశారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికుల సంక్షేమం కోసం అప్కాస్ ఏర్పాటు చేసి, రెగ్యులర్ ఉద్యోగుల మాదిరిగా ప్రతి నేల 1వ తేదీన వేతనాలు అందేలా చర్యలు తీసుకున్నారని తెలియజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కాండ్రుకుంట గురవయ్య, సాదు ఉమామహేశ్వరి రాజేష్, గేదెల నాగరంగమణి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



బదిలీ అయిన ఎస్‌పి ఆరీఫ్‌హఫీజ్‌కు ఘనంగా వీడ్కోలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి :ఇటీవల జరిగిన ఐపిఎస్ సాధారణ బదిలీలో భాగంగా ఇంటిలిజెన్స్ విభాగానికి వెళ్లిన జిల్లా ఎస్‌పి ఆరిఫ్ హఫీజ్‌కు గురువారం జిల్లాపోలీసు కార్యాలయంలో అధికారులు, సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. పోలీసు శాఖలో ఉన్న ఆనవాయితీ ప్రకారం టాప్‌లోని జీపులో నిల్చుబెట్టి అధికారులు, సిబ్బంది జీపును లాగుతూ కార్యాలయం నుంచి ఇంటి వరకు ఊరేగింపు నిర్వహించారు. దారిపొడవున పూలవర్షం కురిపించారు. అధికారులంతా ఘనంగా సత్కరించారు. దాదాపు నాలుగేళ్ల పాటు వివాదాలకు అతీతంగా పనిచేశారని పోలీస్ శాఖకు అందించిన సేవలు మరువలేనివని పలువురు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ట్రైనింగ్ ఎస్పి మనోజ్ హెగ్డే, అదనపు ఎస్‌పిలు సుప్రజా, శ్రీనివాస రావుకోటేశ్వరరావు, పి.శ్రీనివాసరావు, శాంతి కుమార్, పలువురు డిఎస్‌పిలు, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

మెగా డిఎస్సీ కాదు..దగా డిఎస్సీ : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-గుంటూరు

మెగా డిఎస్సీ ఇస్తామని, 6100 పోస్టులు మాత్రమే ఇచ్చి దగా డిఎస్సీ ప్రకటించారని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై.కృష్ణకాంత్ గురువారం ఒక ప్రకటనలో అన్నారు. 25 వేల ఖాళీలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పోరాటాల ద్వారా రద్దు చేయించుకున్న అప్రెంటిస్ విధానం రద్దు చేయాలన్నారు. ప్రతి ఏటా డిఎస్సీ నోటిఫికేషన్ ఇస్తామని హామీ ఇచ్చి, నాలుగున్నరేళ్లలో ఒక్క డిఎస్సీ కూడా ఇవ్వలేదన్నారు. లక్షల మంది నిరుద్యోగుల అభ్యర్థులు నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్నారని, ఎన్నికలు మూడు నెలలు ఉండగా ఇప్పుడు తక్కువ పోస్టులతో నోటిఫికేషన్ ఇస్తామని ప్రకటించటం దారుణమన్నారు. నిరుద్యోగుల్ని నిలువునా దగా చేయటమేనని అన్నారు. తాము అధికారంలోకి వచ్చే ఖాళీగా ఉన్న 23వేల పోస్టులు భర్తీ చేస్తామని చెప్పి, ఉన్న పాఠశాలలు మూసివేశారన్నారు. ప్రకటించిన పోస్టులు కూడా సంవత్సరానికి 1000 పోస్టులు చొప్పున ఆరు సంవత్సరాలు కలిపి 6100 పోస్టులను విడుదల చేస్తామని చెప్పటం మరింత అన్యాయమన్నారు. ఈ మోసాన్ని నిరుద్యోగులు సహించరని, ప్రభుత్వం స్పందించకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు.

విద్యార్థులు చదువుకే పరిమితం కావొద్దు

విజ్ఞాన్స్ మహోత్సవ్ ప్రారంభంలో వక్తలు

ప్రజాశక్తి-గుంటూరు

జాతీయ స్థాయి విజ్ఞాన్ మహోత్సవ్ గురువారం చేబ్రోలు మండలం, వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సిటీలో వైభవంగా ప్రారంభం అయ్యింది. విజ్ఞాన్స్ మహెూత్సవాన్ని ఈ ఏడాది వినూత్నంగా నిర్వహించడంతో జాతీయ స్థాయిలో క్రికెట్ చాంపియన్‌షిప్ పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చిందు యక్షజ్ఞానం ఆర్టిస్ట్ గడ్డం సమ్మయ్య (పద్మశ్రీ అవార్డు గ్రహీత-2024) మాట్లాడుతూ విద్యార్థులు చదువుకే పరిమితం అవ్వకుండా యోగ, సంగీతం, ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించడంలో ముందు వరుసలో ఉండాలన్నారు. చిందు యక్షజ్ఞానం కళతో వేలాది మంది ప్రజలను చైతన్యపరిచానని, చిన్నవయస్సు నుంచే మద్యపాన నిషేధం, అక్షరాస్యత, కుటుంబ నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ, పరిసరాల పరిశుభ్రత, హెచ్ఐవీ వంటి కార్యక్రమాలపైన వేలాది ప్రదర్శనలు ఇచ్చానన్నారు. అర్జునుడు, శ్రీకష్ణుడు, కీచకుడు, కంసుడు, హిరణ్యకస్యపుడు, రావణాసురుడు, ప్రహ్లాదుడు, మార్కేండేయుడు వంటి పాత్రలు ధరించానన్నారు. ఆలిండియా రేడియో, ఆకాశవాణి, దూరదర్శన్ ద్వారా కూడా అనేక ప్రదర్శనలు ఇచ్చానన్నారు. గ్రామీణ ప్రాంత కళైన చిందు యక్షజ్ఞానానికి నేను చేస్తున్న సేవలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డును ప్రకటించడం చాలా సంతోషంగా ఉందన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంబించారు. అనంతరం వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులు మార్చ్ ఫాస్ట్‌ను నిర్వహించారు. ప్రముఖ మ్యూజిక్ కంపోజర్ రఘుకుంచె మాట్లాడుతూ యువతలో అంతర్లీనంగా సృజనాత్మక శక్తులు ఉంటాయని, ఈ సజనాత్మకతను వెలికి తీయడానికే ఈ మహోత్సవాలన్నారు. చదువు అంటే పుస్తకాలు ఒక్కటే కాదని, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా పాఠ్యాంశాలేనన్నారు. యువత తమ సహజ శక్తులను దేశ ప్రయోజనాలకు ఉపయోగించాలన్నారు. విజ్ఞాన్స్ ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ విద్యార్థులు శారీరంగా దృఢంగా ఉంటే మానసికంగా బలంగా ఉంటారని అన్నారు. ఈ మహోత్సవ్‌లో 75 ఈవెంట్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి .కార్యక్రమంలో యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ తదితరులు పాల్గొన్నారు.



గడ్డం సమ్మయ్యను సన్మానిస్తున్న లావు రత్తయ్య, రఘుకుంచే తదితరులు



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

అసరా, సున్నా వడ్డీకి రూ.31 వేల కోట్లు : మంత్రి రజిని

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గత ఐదేళ్ల కాలంలోస్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వం ఎంతో అండగా నిలిచిందని, ఇప్పటి వరకు ఆసరా, సున్నా వడ్డీ పథకం ద్వారా రూ.31 వేల కోట్లు ఖర్చు చేసినట్టు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. ఆసురా ద్వారా డ్వాక్రా మహిళలకు నాలుగో విడత నగదు పంపిణీ కార్యక్రమాన్ని గురువారం స్థానిక స్టార్ గర్ల్స్ హైస్కూల్ ప్రాంగణంలో నిర్వహించారు. విడదల రజిని మాట్లాడుతూ నాలుగో విడత వైఎస్సార్ ఆసరా పంపిణీ కింద ఏకంగా రూ.6394.83 కోట్లను మహిళకు రుణమాఫీ కింద అందజేస్తున్నట్లు చెప్పారు. ఈ పథకం కింద 79 లక్షల మంది అక్కచెల్లెమ్మలకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి భరోసా కల్పించారని వెల్లడించారు. మూడు విడతల ద్వారా ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు రూ.19,175.97 కోట్లు చెల్లించామని, ఇప్పుడు నాలుగో విడతతో కలిపి మొత్తం రూ.25,571 కోట్లు రుణాలను మాఫీ చేశామని వివరించారు. గడిచిన 56 నెలల కాలంలో అనేక సంక్షేమ కార్యక్రమాల ద్వారా కేవలం మహిళలకు ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారా అందించిన సాయమే రూ.2.66 లక్షల కోట్లని వెల్లడించారు.



మాట్లాడుతున్న మంత్రి రజిని

చంద్రబాబునాయుడు మాట ఇచ్చి తప్పారు

గత ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు మహిళల రుణాలు మొత్తం మాఫీ చేస్తానని హామీ ఇచ్చి మాట తప్పారని మంత్రి పేర్కొన్నారు. 2016 నుంచి గత పాలనలో సున్నా వడ్డీ పథకాన్ని సైతం రద్దు చేశారని పేర్కొన్నారు. దీనివల్ల పొదుపు మహిళల అప్పులు చక్రవడ్డీలతో పెరిగిపోయి భారంగా మారాయని వెల్లడించారు. అప్పట్లో సుమారు రూ.3వేల కోట్ల వడ్డీని మహిళలు బ్యాంకులకు అపరాథ వడ్డీ రూపేణ చెల్లించాల్సిన దుస్థితి ఏర్పడిందని వివరించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ సున్నావడ్డీ లాంటి పథకాల ద్వారా లబ్ధిపొందిన అక్కచెల్లెమ్మల పొదుపు సంఘాలు తిరిగి క్రియాశాలకంగా మారాయని వెల్లడించారు.

మాయమాటలు నమ్మి మోసపోవద్దు

గుంటూరు నగర మేయర్ కావటి శివనాగమనోహర్‌నాయుడు మాట్లాడుతూ మాయ మాటలు నమ్మి మహిళలు మోసపోవద్దని తెలిపారు. ఎన్నికల సమయంలో దొంగ హామీలు ఇచ్చి మరోసారి ప్రజలను మోసం చేసేందుకు తెలుగుదేశం పార్టీ సిద్ధంగా ఉందని చెప్పారు. అప్రమత్తంగా లేకపోతే మళ్లీ దోపిడీకి గురవుతామని పేర్కొన్నారు.

జిల్లా స్థాయి ఆడుదాం ఆంధ్ర పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు

శారీరక దృఢత్వానికి, మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక ఎన్టీఆర్ క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ, విప్ లేళ్ళ అప్పిరెడ్డి, జెడ్పీ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా, జెసి జి.రాజకుమారి, నగర మేయర్ కావటి మనోహర నాయుడు, కమిషనర్ కీర్తి చేకూరి, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే షేక్.మహమ్మద్ ముస్తఫా, రాష్ట్ర గ్రంధాలయ పరిషత్ ఛైర్మన్ మందపాటి శేషగిరిరావు, రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల సహాయ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ ముంతాజ్ పఠాన్‌తో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ క్రీడా జ్యోతిని వెలిగించి, క్రీడాకారిణి సుప్రియకు అందించారు. బెలూన్లు ఎగురవేసి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 79,384 మంది పురుషులు, 66,545 మంది మహిళలు వెరసి మొత్తంగా 1,45,929 మంది 15 సంవత్సరాలు, ఆ పై వయస్సు ఉన్న క్రీడాకారులు క్రికెట్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడలు ఆడేందుకు ఉత్సాహంగా స్వచ్ఛందంగా గ్రామ, వార్డు సచివాలయాలలో రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. క్రీడల నిర్వహ ణకు 231 క్రీడా ప్రాంగణాలను మరియు 236 పిఈటి / పీడీ లను ఎంపిక చేసి వారికి శిక్షణ కల్పించి క్రీడాపోటీలను సజావుగా నిర్వహించేం దుకు చర్యలు తీసుకోవడం జరిగిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో గెలుపొందిన 70 టీములకు (మహిళా టీములు-35, పురుషులు టీములు-35) పోటీలు 1, 2, 3 తేదీల్లో జిలా స్థాయి పోటీలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో డిఆర్ఓ కె.చంద్రశేఖరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.స్వాతి, ఆర్డిఓ శ్రీఖర్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



క్రీడాజ్యోతి వెలిగిస్తున్న కలెక్టర్, తదితరులు

పల్నాడులో రెవెన్యూ ఫిల్లింగ్ స్టేషన్ ప్రారంభం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన రెవెన్యూ ఫిల్లింగ్ స్టేషన్ సేవలను ప్రభుత్వ అధికారులు సిబ్బంది మరియు ప్రజలు సద్వినియోగం చేసుకుని అభివృద్ధి పథంలో నడిపేలా చూడాలని జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి కోరారు. గురువారం స్థానిక కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో రూ 3 కోట్ల వ్యయంతో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన రెవెన్యూ ఫిల్లింగ్ స్టేషన్‌ను జిల్లా కలెక్టర్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ ఫిల్లింగ్ స్టేషన్ ద్వారా నెలకు రూ 80 వేలు లీజు నగదు వస్తుందని, రూ 6 లక్షల వరకు ఆదాయం లభించేలా చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. వచ్చిన ఆదాయాన్ని ప్రభుత్వ ఖర్చులకు, మౌలిక వసతులు ఏర్పాటుకు ఉపయోగిస్తామన్నారు. ప్రభుత్వ కార్యకలాపాలకు బడ్జెట్ పై ఆధార పడకుండా స్వయంగా ఏర్పాటు చేసుకున్న నిధులతో నిర్వహించు కునేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. సాధారణంగా కార్పొరేషన్‌లో మున్సిపల్ కార్యాలయం పరిధిలో పెట్రోల్ బంకులు ఉంటాయని, అయితే సీతంపేటలో పనిచేసేటప్పుడు అక్కడ ఐటీడీఏ తరపున ఫిల్లింగ్ స్టేషన్ ఏర్పాటు చేసి నిధులు సమకూర్చడం జరిగిందన్నారు. నూతన జిల్లాగా ఏర్పడిన పల్నాడు జిల్లాలో ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ నిర్మాణానికి ప్రతిపాదన పంపించి 32 ఎకరాలు మంజూరు చేయించుకోవడం జరిగిందన్నారు. మంజూరైన స్థలంలో రెవెన్యూ సొసైటీ సహాయంతో పెట్రోల్ బంకును ఏర్పాటు చేశామన్నారు. సిబ్బంది నియామకంతో పాటు పూర్తి నియంత్రణ బాధ్యత జిల్లా రెవెన్యూ అధికారి వద్ద ఉంటాయన్నారు. మాచర్ల, శావల్యాపురంలో పెట్రోల్ బంకులు ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. స్వయంగా నిధులు సమకూర్చుకునే విధంగా స్థానిక నరసరావుపేటలోని రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయం ప్రాంగణంలో షాపులు ఏర్పాటుకు రెవెన్యూ సొసైటీ తరపున చర్యలు తీసుకోవడం జరిగిందని , షాపుల అద్దెలతో రెవెన్యూ పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రెవెన్యూ ఫిల్లింగ్ స్టేషన్ ఏర్పాటు లో జిల్లా అధికారి కృషి అభినందనీయమని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఏ .శ్యాంప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ప్రతినిధులు శ్రీరామ్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న పల్నాడు జిల్లా కలెక్టర్



నరసరావుపేటలో నూతనంగా ఏర్పాటు చేసిన ఫిల్లింగ్ స్టేషన్